తెలంగాణ పవర్

తెలుగు దినపత్రిక

ఈనెల 27న పింక్ పవర్ రన్ 3.0

ఆరోగ్య సంరక్షణపై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈనెల 27న పింక్ పవర్ రన్ 3.0 ను నిర్వహిస్తున్నట్లు సుధా రెడ్డి ఫౌండేషన్ చైర్ పర్సన్ సుధా రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్ లోని ఓ హోటల్ లో రన్ కు సంబంధించిన జెర్సీ, మెడల్స్ ను మిస్ వరల్డ్ 2025 ఓపల్ సుచత, ప్రముఖ క్యాన్సర్ చికిత్స నిపుణురాలు ప్రజ్ఞ చిగురుపాటి నాతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధా రెడ్డి మాట్లాడుతూ తాను లండన్ లో ఉన్న సమయంలో అక్కడి స్థానికులు ఆరోగ్యంపై వహిస్తున్న శ్రద్ధను గమనించి ఇక్కడి ప్రజలకు ముఖ్యంగా మహిళలకు ఆరోగ్య సంరక్షణ పై అవగాహన కల్పించాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగానే ఈమెయిల్ ఫౌండేషన్ తో కలిసి పింక్ పవర్ రన్స్ ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ హెల్త్ పార్టనర్ గా ఏఐజి సంస్థ భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. 20వేల మందికి పైగా రన్ లో పాల్గొనే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 285 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | మంగళవారం, సెప్టెంబర్ 08, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

కమ్యూనిస్టులు లేవనెత్తిన ప్రతీ సమస్యను కాంగ్రెస్ పరిష్కరించింది

సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభతో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: కామ్రేడ్ సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. రేవంత్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతం నుంచి జాతీయ స్థాయి వరకు వెళ్లి రైతుల కోసం తన జీవితాన్ని ధారపోసిన నాయకుడు సారంపల్లి మరణం రైతాంగానికి తీరని లోటని అన్నారు.

నమన్యపై అవగాహన, సంస్కారవంతంగా అంశాలను లేవనెత్తడంలో సారంపల్లికి సాటి లేరు కౌలు రైతుల సమస్య, పంటలు గిట్టుబాటు ధర కోసం ఆయన ఎంతో పోరాడారు. భూమి సారం నుంచి పంట తీసేవరకు సమస్యను పూర్తిగా అర్థం చేసుకున్న ఎన్ సైక్లోపీడియా సారంపల్లి. ఆయన రాసిన పుస్తకాలు, లేవనెత్తిన అంశాలను దృష్టిలో పెట్టుకుని రైతాంగ సమస్యలను మా ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. సారంపల్లి మల్లారెడ్డి అంటే వ్యక్తిగతంగా నాకు ఎంతో అభిమానం. భూమిలేని నిరుపేదలకు కనీస కూలీ ఉండాలని కమ్యూనిస్టులు కొట్లాడారు. కనీస వేతన చట్టం తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ . దున్నేవాడికి భూమికోసం కమ్యూనిస్టులు పోరాడారు . అసైన్డ్ భూములను 24 లక్షల 56 వేల ఎకరాలు కాంగ్రెస్ ప్రభుత్వం పంచింది . 10 లక్షల ఎకరాలు ఆదివాసీల చేతుల్లో ఉన్నాయి . ఇది కమ్యూస్టుల పోరాటానికి .. కాంగ్రెస్ పరిష్కారం . ఉపాధి హామీ చట్టం ద్వారా పని కల్పించింది కాంగ్రెస్ పార్టీ . ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ తీసుకొచ్చింది కాంగ్రెస్ పార్టీ . కమ్యూనిస్టులు లేవనెత్తిన ప్రతీ సమస్యను కాంగ్రెస్ పరిష్కరించింది . ఎన్నికల్లో కలిసినా కలవకపోయినా.. కమ్యూనిస్టుల పోరాటం కాంగ్రెస్ పార్టీకి ఉపయోగపడింది . మనమంతా కలసి దేశంలో మోదీకి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉంది . ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికల్లో గెలవలేనప్పుడు కొత్త కొత్త విధానాలను అవలంబిస్తున్నారు . ఎస్ఐఆర్ పేరుతో బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ ఓట్లను టార్గెట్ చేసుకున్నారు . తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర చేస్తున్నారు . బెంగాల్ లో చేసినట్లే తెలంగాణలో చేస్తామని బీజేపీ నాయకులు బరితెగించి మాట్లాడుతున్నారు . గత ఎన్నికల్లో బూత్ ల వారీగా బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారు. ప్రైవేటు ఏజెన్సీలను పెట్టి సర్వేలు చేయించి క్రమపద్ధతిలో ఓట్లు తొలగిస్తున్నారు . ఎన్నికల కమిషన్ ను కూడా బీజేపీ రాజకీయాలకు వాడుకుంటోంది . సాఎఖీ పై ప్రధాన ప్రతిపక్షం ఏ ఒక్క మాట మాట్లాడటంలేదు . దీని వెనక వారికున్న అవగాహనను కమ్యూనిస్టులు అర్థం చేసుకోవాలి . ఎన్నికలు వేరు.. పేద ప్రజల ప్రాథమిక హక్కులు వేరు . ఇన్నాళ్లుగా పేదల హక్కుల కోసం కమ్యూనిస్టులు కొట్లాడుతున్నారు . ఎర్రజెండా కనిపిస్తే పేదవాడికి నొక భరోసా . దేశానికి అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి నరేంద్రమోదీ . మోదీ ఓటమే కమ్యూనిస్టుల గెలుపు . పేద ప్రజల ఓటు హక్కును కమ్యూనిస్టులు కాపాడాలి . కేబినెట్ సహచరులతో చర్చించి.. సారంపల్లి మల్లారెడ్డి గారి పేరు చిరస్థాయిగా నిలిచిపోయేలా చేస్తామని అన్నారు.

దుద్దిళ్ల శ్రీపాద రావు సెంట్రల్ హాల్ ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్: శాసనసభ ప్రాంగణంలో నూతనంగా రూపుదిద్దుకున్న సెంట్రల్ హాల్ను సభా నాయకుడు, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మాజీ శాసనసభ స్పీకర్ స్వర్గీయ దుద్దిళ్ల శ్రీపాద రావు పేరుతో సెంట్రల్ హాల్గా నామకరణం చేసిన ఈ ప్రాంగణ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి తో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి , శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ , శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రిశ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు తో పాటు మంత్రులు, ప్రభుత్వ విప్లు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు.

మాజీ శాసనసభ స్పీకర్ శ్రీపాద రావు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి గౌరవ సభ్యులతో కలిసి బ్రేక్ఫాస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని టీఆర్ఎస్ కవిత ర్యాలీ



హన్మకొండ: ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించాలని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హన్మకొండ అంబేద్కర్ విగ్రహం వద్ద నుంచి హన్మకొండ కలెక్టరేట్ వరకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు కల్వకుంట్ల కవిత విద్యార్థులతో కలిసి ర్యాలీ చేసారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు

కవిత మాట్లాడుతూ విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోంది. ఈ ముఖ్యమంత్రి ఒకసారి ఇంటర్మీడియట్ విద్యా విధానం తీసేస్తానని అంటారు.. ఇంకోసారి పాలిటెక్నిక్ ను స్కిల్ యూనివర్సిటీలో విలీనం అంటారు. విద్యార్థుల ఫీ రీయింబర్స్మెంట్ చెల్లించక పోవడంతో లక్షలాది మంది డిగ్రీలు, ప్రొఫెషనల్ డిగ్రీలు పూర్తి చేసినా సర్టిఫికెట్లు అందక ఉద్యోగాలు పొందలేక పోతున్నారు. ఫీ రీయింబర్స్మెంట్ బకాయిలు చెల్లించే వరకు ఈ ప్రభుత్వంపై పోరాడుతామని అన్నారు.

అసెంబ్లీ గేటు వద్ద ఉద్రిక్తత..

అరెస్టుకు యత్నించగా కిందపడిపోయిన హరీష్ రావు, కేటీఆర్‌కు గాయాలు!



హైదరాబాద్, సెప్టెంబర్ 7: శాసనసభ సమావేశాల వేళ అసెంబ్లీ ప్రాంగణం వద్ద నేటి ఉదయం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి చేరుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడంపై గులాబీ శ్రేణులు భగ్గుమన్నాయి. పోలీసుల వ్యవహార శైలికి, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులపై జరిగిన భౌతిక దాడులకు నిరసనగా రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని బీఆర్ఎస్ అధిష్టానం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చింది. పోలీసులు ప్రదర్శించిన అత్యుత్సాహం, అప్రజాస్వామిక వైఖరిపై బీఆర్ఎస్ నాయకత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ వద్దకు వచ్చిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అనుచితంగా ప్రవర్తించారని హరీష్ రావు ఆరోపించారు. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి దారుణంగా ప్రవర్తించారని అన్నారు. మంత్రిగా సేవలు అందించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని సైతం జుట్టు పట్టి లాగడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలుపుతుందని ఎద్దేవా చేశారు. అక్కాచెల్లెమ్మలతో ఇంత దుర్మార్గంగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిచ్చినట్లు హరీష్ రావు తెలిపారు. మేం సభలో లేని సమయంలో ప్రధాన ప్రతిపక్షం లేకుండా వివాదాస్పద 22 ఏ నిషేధిత భూముల అంశంపై చర్చ జరపడం సరికాదన్నారు. తాము చేసేది తప్పు కాదంటే, ఎలాంటి అవినీతి, అక్రమాలు జరగలేదని భావిస్తే బీఆర్ఎస్ సభ్యులు సభకు వచ్చినప్పుడు చర్చ జరగపాలని హరీష్ రావు ప్రభుత్వానికి సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నిస్తామన్న భయంతో మేం లేని సమయం చూసి సభలో చర్చిస్తున్నారు. ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే కనుక మేం సభకు వచ్చినప్పుడు కీలకమైన నిషేధిత భూముల అంశంపై చర్చ జరగాలని ప్రభుత్వానికి హరీష్ రావు సూచించారు. పోలీసుల తోపులాటలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతికి, నుదిటికి గాయాలైనట్లు తెలుస్తోంది. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీశ్ రెడ్డి కిందపడిపోయారు. తమను పోలీసులు అడ్డుకోవడంతో అసెంబ్లీ గేటు వద్ద హరీష్ రావు తన చొక్కా విప్పేశారు. నల్ల టీషర్టుతో లోపలికి అనుమతించకపోవడంతో హరీష్ రావు బనియన్‌తో నిరసన తెలుపగా, ఆయనతో పాటు వేముల ప్రశాంత్ రెడ్డి, కల్వకుంట్ల సంజయ్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేసి తెలంగాణ భవన్‌కు తరలించారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా పోలీసులు తమపై అమానుషంగా ప్రవర్తించారని పార్టీ నేతలు ఆరోపించారు. మరోవైపు, మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యంత దుర్మార్గంగా ప్రవర్తించారని బీఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. అసెంబ్లీకి వెళుతున్న సమయంలో ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి చీరను పోలీసులు లాగడంతో ఆమె కన్నీళ్లు పెట్టుకుంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై మండిపడ్డారు. అలాగే మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రా రెడ్డిని జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లడం మహిళల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న గౌరవం ఇదేనా అని పోలీసుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ సమావేశాల ప్రారంభం సందర్భంగా అసెంబ్లీ గేటు వద్ద పోలీసుల అక్రమ అరెస్టులు, దాడుల ఘటనలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పార్టీ నిర్ణయించింది.

నా చీర లాగారు

తెలంగాణ శాసనసభ ప్రారంభానికి ముందే వద్ద ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారనే విమర్శలు వస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల విఫల పాలనకు నిరసనగా గన్‌పార్క్ నుంచి అసెంబ్లీ వైపు నల్ల దుస్తులతో బయలుదేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు.ఈ క్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు అవమానకరంగా ప్రవర్తించి, ఆమె చీర పట్టుకుని లాగారని ఆరోపిస్తూ గులాబీ నేతలు తీవ్ర నిరసన తెలిపారు.



మహిళా ఎమ్మెల్యేలు అని కూడా చూడకుండా పోలీసులు చీర లాగి మరి, దుర్మార్గంగా ప్రవర్తిస్తున్నారని సునీతా లక్ష్మారెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్సాహసం చేసిన పోలీసులు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకే ఒక మహిళా ఎమ్మెల్యే అని కూడా చూడకుండా సభ సాక్షిగా సునీతా లక్ష్మారెడ్డి చీర లాగి అవమానించారని, పోలీసుల ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఇది క్షమించరాని నేరమని, యావత్ తెలంగాణ అక్కాచెల్లెళ్లపై జరిగిన దాడిగా ఆయన అభివర్ణించారు. బాధ్యులైన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. హామీల అమలుపై ప్రశ్నిస్తారన్న భయంతో ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యుల్ని అసెంబ్లీకి రానివ్వకుండా ప్రభుత్వం అడ్డుకుంటోందని ఆరోపించారు. పోలీసుల వైఖరిని, బలవంతపు అరెస్టులను నిరసిస్తూ అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు నాయకులు షర్టులు విప్పేసి నిరసన తెలిపేందుకు ప్రయత్నించడంతో వాతావరణం మరింత వేడెక్కగా.. హరీష్ రావు, కేటీఆర్ సహా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసు వాహనాల్లో అక్కడి నుంచి తరలించారు.తెలంగాణ శాసనసభ వద్ద సోమవారం ఉదయం తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యాలు, హామీలపై నిలదీస్తారనే భయంతో నల్ల చొక్కాలు ధరించిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకుని కేటీఆర్, హరీశ్ రావు, లక్ష్మారెడ్డిలను బలవంతంగా అరెస్ట్ చేశారని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఈ తోపులాటలో హరీశ్ రావు, జగదీష్ రెడ్డి కిందపడిపోగా, కేటీఆర్‌కు గాయాలయ్యాయి. ప్రతిపక్షం లేని సభను నడపాలనే దుర్మార్గమైన ఆలోచనతోనే రేవంత్ ప్రభుత్వం ఈ అక్రమ అరెస్టులు, భౌతిక దాడులకు దిగిందని బీఆర్ఎస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తింది. నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తున్న పోలీసుల తీరుపై గులాబీ నేతలు మండిపడుతున్నాయి.

తెలంగాణ పవర్

సంపాదకీయం

మంగళవారం, సెప్టెంబర్ 08, 2026

మళ్లీ మొదటికి నీటి పంచాయితీ

కృష్ణా జలాల్లో వాటాల విషయంలో కొట్లాడుకుంటున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆరెస్ పార్టీల నేతలు.. అసలు విషయాన్ని పక్కన పెట్టి.. షాడో ఫైట్ చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీటి వాటాలు ఉన్నా.. వాటిని వినియోగించుకునేందుకు తగిన ప్రాజెక్టులు ఏవని సాగునీటి నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ముందుగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. కేటాయింపుల మేరకైనా నీటిని నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ ఇంకా తెగలేదు. కృష్ణా జలాలపై తమ వాటాలపై ఇంకా ఎటూ తేలలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలను తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధ కృష్ణా బోర్డు ఆఫీసులో త్రిసభ్య కమిటీ భేటీ అయింది. కృష్ణా బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ రమేశ్‌బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నరసింహమూర్తి సమావేశం అయ్యారు. ఆగస్టు 25న జరిగిన సమావేశంలో చర్చలు కొలిక్కి రాకపోవడంతో బోర్డు సమావేశం వాయిదా పడిన సంగతి తెలిసిందే. తిరిగి శుక్రవారం మరోసారి బోర్డు సమావేశం జరిగినా.. ఎలా ఫలితం తేలకుండానే ముగిసింది. ఈ నెల చివరి వారంలో మరోసారి జరిగే కృష్ణా బోర్డు సమావేశానికి కేఆర్ఎంబీ చైర్మన్ బోర్డు అధ్యక్షత వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలోని నీటి నిల్వలను తాగునీటికే వినియోగించాలని మొదటిగా చర్చించారు. కృష్ణా బేసిన్‌లో ప్రజలకు ఎక్కువ భాగం తాగునీటిని సరఫరా చేయాలని, ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలకు 50% వాటా కింద నీటిని విడుదల చేయాలని తెలంగాణ కోరింది. వచ్చే ఏడాది ఆగస్టు వరకు 200 టీఎంసీలు కేటాయించాలని కోరింది. తమ అవసరాలకు 104 టీఎంసీల కేటాయించాలని ఏపీ.. కృష్ణా బోర్డును కోరింది. ఏపీ, తెలంగాణలకు 66:34 నిష్పత్తిని అమలు చేస్తూ తక్షణమే తమకు 97 టీఎంసీల నీళ్లు విడుదల చేయాలని ఏపీ కోరింది. అయితే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండడంతో 50 శాతం చొప్పున జలాలు కేటాయించాలని తెలంగాణ కోరింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని తెలంగాణ ఆరోపించింది. దీనిపై ఏపీ స్పందిస్తూ న్యాయబద్ధంగా వచ్చిన నీటి నుంచే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్నట్లు పేర్కొంది. అవసరం లేకున్నా.. తెలంగాణ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి నీటిని దిగువకు వదులుతోందని పేర్కొంది. దానిని వెంటనే అడ్డుకోవాలని కోరింది. దీనికి తెలంగాణ స్పందిస్తూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ తరలిస్తున్న నీటిని వెంటనే నియంత్రణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో ఇరు రాష్ట్రాలు ఉమ్మడి జలాశయాల నుంచి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్ సూచించారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీటి విడుదలను ఏపీ నియంత్రించాలి. విద్యుదుత్పత్తికి నీటిని విడుదల చేయడాన్ని తెలంగాణ ఆపాలని కోరారని మినిట్స్‌లో తెలియజేశారు. పులిచింత, కేడీఎస్, తుంగభద్రతో సహా అనేక ప్రాజెక్టుల్లో, పెన్నా బేసిన్‌లో 80 టీఎంసీలు ఉన్నాయని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉమ్మడి జలాశయాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం ఉన్న నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకే కేటాయించాలని తెలంగాణ వాదించింది. హైదరాబాద్ మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని, ఉమ్మడి జలాశయాల నుంచి 200 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరింది. అలాగే పాత విధానం కాకుండా రెండు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో సమానంగా నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్‌బాబు ప్రతిపాదించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తోందని, ఇటీవల ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కూడా అనుమతుల్లేకుండా జలాలను తోడేస్తోందని తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.తెలంగాణ డిమాండ్‌ను ఏపీ తీవ్రంగా తిరస్కరించింది. ప్రస్తుతానికి తక్షణ అవసరాల కోసం 97 టీఎంసీలను విడుదల చేయాలని కోరారు. తమ వాటా పరిధిలోనే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నీటిని వాడుకుంటున్నామని స్పష్టం చేస్తూ.. తెలంగాణ డిమాండ్ చేసిన 200 టీఎంసీల కేటాయింపు సహేతుకం కాదన్నారు. పైగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం నుంచి అనవసరంగా దిగువకు నీటిని విడుదల చేస్తోందని, దీనిని తక్షణమే నిలువరించాలని ఏపీ ఫిర్యాదు చేసింది.పోతిరెడ్డిపాడు 19 టీఎంసీలు, చెన్నై తాగునీటి కోసం 15 టీఎంసీలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది అక్టోబరు వరకు 22 టీఎంసీలు తీసుకుంటామని ఏపీ చెప్పిందన్నారు. ఇప్పటికే 20 టీఎంసీలు వాడుకున్నారన్నారు. వెలిగొండ నుంచి కూడా వాడుకుంటూ.. ఇంకా పాత నిష్పత్తిలో నీటి కేటాయింపు కావాలని కోరడం సరికాదన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఏపీకి 104 టీఎంసీలు కావాలని కోరామని ఏపీ ఈఎన్సీ నరహింమూర్తి తెలిపారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలనడం సరికాదన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు కోసం కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ పనులు వేగవంతం చేసున్నా.. తెలంగాణ ప్రభు త్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో లేని నీటి వివాదాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని, ఆయన హయాంలో ఏపీ నాయకులు ఎందుకు ఇంత ధైర్యం చేయలేదని ప్రశ్నించారు. వరదలు లేని సమయంలో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడంలో ఆంతర్యమేందని నిలదీశారు. కాళేశ్వరం బరాజ్‌లు సురక్షితమేనని ఎన్‌డీఎస్‌ఏ, సీడబ్ల్యూఐఆర్ఎస్ సంస్థలు స్పష్టత ఇచ్చిన తర్వాతైనా కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్‌చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలమూరు పంపులనూ ఆన్ చేయాలని కోరారు.సీఎం రేవంత్‌రెడ్డికి కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు.

- ఎడిటర్

కేసీఆర్ గైర్హాజరు కథేంటి...



హైదరాబాద్, సెప్టెంబర్ 7, (న్యూస్ పల్స్) తెలంగాణ శాసనసభ సమావేశాలు ప్రారంభమైనప్పుడల్లా రాజకీయ వర్గాల్లోనూ, సాధారణ ప్రజానీకంలోనూ నలిగే ఏకైక ప్రశ్నకు బీఆర్ఎస్ నుంచి ఇప్పటివరకు స్పష్టమైన సమాధానం లభించలేదు . అసలు కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు వెళ్లరు అనేదే ఆ ప్రశ్న. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సభకు రాని కేసీఆర్ రాజీనామా చేయాలి అంటూ వరుస ధర్నాలు, ఆందోళనలు చేపడుతున్న వేళ.. ఆయన నిర్వహించిన బీఆర్ఎస్ఎల్పీ సమావేశంపై అందరి దృష్టి పడింది. కానీ అక్కడ కూడా రేవంత్‌ను బూతుల రాయుడు అంటూ తీవ్ర పదజాలంతో విమర్శించారే తప్ప, తాను సభకు హాజరుకాకపోవడానికి గల అసలు కారణాలను చెప్పడంలో కేసీఆర్ మళ్లీ విఫలమయ్యారు. త్వరలోనే పాదయాత్ర చేస్తానని ప్రకటించడం ద్వారా తనకు ఆరోగ్య సమస్యలేవీ లేవనే స్పష్టతనిచ్చిన కేసీఆర్, అసెంబ్లీ దాకా అడుగులు పడకపోవడానికి గల సమీకరణాలను మాత్రం గోప్యంగానే ఉంచారు.కేసీఆర్ అసెంబ్లీకి రాకపోవడానికి ప్రధాన కారణం ఆయన భావించే రాజకీయ స్థాయి . దశాబ్దకాలం పాటు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ఏకఛత్రాధిపత్యంగా ఏలిన తనకు, తానెంతో తేలికగా తీసిపారేసిన రేవంత్ రెడ్డి సభానాయకుడి హోదాలో బెంచీపై కూర్చోవడం కేసీఆర్ మనస్తత్వం అంగీకరించడం లేదనేది బహిరంగ రహస్యం. తనకంటే వయస్సులో, రాజకీయ అనుభవంలో చిన్నవాడైన రేవంత్ ముందు తాను ప్రతిపక్ష నేతగా మైక్ కోసం నిలబడటాన్ని తన స్థాయికి తక్కువగా ఆయన భావిస్తున్నారని భావిస్తున్నారు. అయితే, ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ స్థాయిలు అనేవి స్వయంకృతాపరాధాలు కావు, ప్రజలు తీర్పు ద్వారా కట్టబెట్టే పదవులు మాత్రమే అనే కనీన సత్యాన్ని గులాబీ అధినేత విస్మరిస్తున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి.సభకు వెళ్తే రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ మంత్రులు తనను వ్యక్తిగతంగా అవమానిస్తారనే భయం కేసీఆర్‌కు ఉందనుకోవడం కూడా పొరపాటే. ఒకవేళ ప్రతిపక్ష నేత స్థాయి వ్యక్తిని సభలో అధికార పక్షం అనుచితంగా అవమానిస్తే, అది రాజకీయంగా సానుభూతిని తెచ్చిపెట్టి కేసీఆర్‌కే మేలు చేస్తుంది. పైగా కేసీఆర్ సభకు వస్తే పూర్తి స్థాయి గౌరవం ఇస్తాం అని రేవంత్ రెడ్డి స్వయంగా ఒకటిరెండు సార్లు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌మోహన్ రెడ్డి తనకు ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదనే సాంకేతిక కారణాన్ని చూపి సభను బహిష్కరిస్తున్నారు. కానీ కేసీఆర్‌కు ఆ సమస్య లేదు. ఆయనను అసెంబ్లీ రికార్డులు అధికారిక ప్రతిపక్ష నేత గా గుర్తించాయి, ఆ పదవికి ఉండే క్యాబినెట్ హోదా, సదుపాయాలు కూడా ఆయన ఖాతాలోనే ఉన్నాయి. ఇన్ని అనుకూలతలు ఉండి కూడా కారణం చెప్పకుండా సభకు దూరంగా ఉండటం తీవ్ర అస్పష్టతకు దారితీస్తోంది.బీఆర్ఎస్ నాయకత్వం కేసీఆర్ సభకు వస్తే రేవంత్ తట్టుకోలేడు అంటూ పైపైన చేసే వ్యాఖ్యలు కేవలం కేడర్‌లో ధైర్యాన్ని నింపేందుకు ఉపయోగపడతాయే తప్ప, సాధారణ ఓటరును మెప్పించలేవు. శాసనసభ అనేది ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసే అత్యున్నత వేదిక. అటువంటి వేదికను వదిలేసి, రాజ్యాంగబద్ధమైన ప్రతిపక్ష నేత బాధ్యతను పక్కనబెట్టి ఇతర రాజకీయాలు చేయడం సభా బాధ్యతల నుంచి పారిపోతున్నారనే సంకేతాలు ప్రజల్లోకి వెళ్తున్నాయి. తాను పాల్గొనని సభకు ప్రతిపక్ష నేతగా కొనసాగడం కంటే, ఆ బాధ్యతలను సభకు క్రమం తప్పకుండా వచ్చే కెటిఆర్ లేదా హరీష్ రావు లాంటి క్రియాశీల నేతలకు అప్పగించి ఉంటే బాధ్యతాయుతంగా ఉండేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.మొత్తానికి, కేసీఆర్ అనుసరిస్తున్న ఈ సైలెంట్ బాయ్‌కాట్ వ్యూహం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా పెద్ద ఆయుధంగా మారింది. ప్రజలు ఇచ్చిన ప్రతిపక్ష హోదాను గౌరవించని నేత అంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం రోజురోజుకూ బలాన్ని పుంజుకుంటోంది. డీఎస్సీ, రైతు రుణమాఫీ, కాళేశ్వరం లాంటి కీలక అంశాలపై సభలో నేరుగా ముఖ్యమంత్రితో తలపడి ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో పడేసే అవకాశం స్పష్టంగా ఉన్నప్పటికీ, కేవలం వ్యక్తిగత పట్టింపుల వల్ల ఆ అవకాశాన్ని బీఆర్ఎస్ చేజార్చుకుంటోందని అనుకోవచ్చు.

తనికెళ్లలో ఘనంగా ఆలయాల శంకుస్థాపన మహోత్సవం
చంద్రమౌళీశ్వర, ఆంజనేయస్వామి ఆలయాల పునర్నిర్మాణానికి రూ.3.50 కోట్లు



కొణిజర్ల, సెప్టెంబర్ 7: కొణిజర్ల మండలంలోని తనికెళ్ల గ్రామంలో ప్రఖ్యాత గాంచిన చంద్రమౌళీశ్వర స్వామి, ఆంజనేయస్వామి దేవాలయాల పునర్నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై బాలాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. సుమారు 85 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయాలను రూ. 3.50 కోట్ల వ్యయంతో పునర్నిర్మించనున్నట్లు తెలిపారు. ఆలయాల అభివృద్ధికి ఎంపీ రఘురాం రెడ్డి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇవ్వడంతో కమిటీ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్,ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి కిలారు అనిల్ కుమార్, జిల్లా నాయకులు కిలారు వెంకటరమణ, డిస్టిక్‌ఆర్టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న,రాష్ట్ర కిసాన్ సెల్ ఉపాధ్యక్షులు బానోత్ బాలాజీ నాయక్,కాంగ్రెస్ నాయకులు మద్దినేని రమేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గోపి, సర్పంచ్ గదల కళావతి, ఉపసర్పంచ్ చల్ల నరసింహారావు, దేవస్థానం కమిటీ చైర్మన్ మిట్టపల్లి శ్రీనివాస్ రావు, ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రముఖులు, భక్తులు,పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

తాత మధుసూదన్ వ్యాఖ్యలు యావత్ తెలంగాణ దళిత జాతికి అవమానకరం: చైర్మన్ పుల్కం రాజు
దళిత జాతికి కేసీఆర్, కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



వేములవాడ, సెప్టెంబర్ 07 : రాజ్యాంగబద్ధమైన తెలంగాణ శాసనసభాపతి స్థానంలో ఉన్న దళిత బిడ్డ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేయడంపై వేములవాడలో తీవ్ర నిరసన జ్వాలలు వ్యక్తమయ్యాయి. స్పీకర్‌ను ఉద్దేశించి ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ వేములవాడ పట్టణ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్‌పై తక్షణమే చట్టరీత్యా చర్యలు తీసుకుని, ఆయన శాసనమండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట ఎమ్మెల్సీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.?ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మాట్లాడుతూ.. అత్యున్నతమైన రాజ్యాంగబద్ధ స్థానాన్ని, అసెంబ్లీ సభాపతి పీఠాన్ని అవమానించడం అంటే సమగ్ర దళిత సమాజాన్ని, ప్రజాస్వామ్య వ్యవస్థను, భారత రాజ్యాంగాన్ని తీవ్రంగా అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ స్థానానికి ప్రత్యేక గౌరవం ఉంటుందని, అటువంటి వ్యక్తిపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు.?తమ పార్టీ ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ బీఆర్ఎస్ పార్టీ అధినేతలు కేసీఆర్, కేటీఆర్‌లు వెంటనే స్పందించాలని పుల్కం రాజు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ అగ్రనేతలు రాష్ట్ర దళిత సమాజానికి, యావత్ దళిత జాతికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని స్పష్టం చేశారు. దళితుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించిన ఎమ్మెల్సీపై తగిన చర్యలు తీసుకోకపోతే, బీఆర్ఎస్ నాయకుల అహంకార ధోరణికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, పట్టణ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, రూరల్ మండల అధ్యక్షుడు సామ తిరుపతిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు వకుళభరణం శ్రీనివాస్, కూరగాయల కొమరయ్య, బొడ్డు రాములు, ఏడపల్లి అనిల్, రొమాల ప్రవీణ్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

తెలంగాణ ద్రోహి కేటీఆర్ గారూ.. సినిమా డైలాగులు కాదు, తెలంగాణ యువతకు ఉద్యోగాలు కావాలి: ఎంపీ వంశీకృష్ణ

పెద్దపల్లి: తెలంగాణ యువత భవిష్యత్తును రాజకీయాలకు బలి చేయకుండా, వారికి విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ అన్నారు. గత పదేళ్ల పాలనలో యువతకు ఇచ్చిన హామీలు, ఉద్యోగాల విషయంలో జరిగిన పరిణామాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సుమారు 1,500 మంది విద్యార్థులు ప్రాణత్యాగం చేశారని, వారి త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రంలో పదేళ్ల పాటు కీలక బాధ్యతల్లో ఉన్న నాయకులు తెలంగాణ యువత భవిష్యత్తుపై మరింత బాధ్యతగా వ్యవహరించాల్సి ఉండేదని ఎంపీ వంశీకృష్ణ అన్నారు.“ఐటీ మంత్రిగా ఉన్న సమయంలో తెలంగాణ యువతకు ఎన్ని ఉద్యోగాలు కల్పించారు? యువత నైపుణ్యాలను పెంచేందుకు ఏం చేశారు? ఉపాధి అవకాశాల కోసం ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు?” అని కేటీఆర్‌ను ప్రశ్నించారు.పరీక్షా పత్రాల లీకేజీలు, ఉద్యోగ నియామకాలపై వచ్చిన అవకతవకల ఆరోపణలు విద్యార్థులు, నిరుద్యోగ యువత జీవితాలపై తీవ్ర ప్రభావం చూపాయని ఎంపీ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే ఏ చర్యనైనా తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు.“సినిమా డైలాగులు చెప్పడం సులభం. కానీ తెలంగాణ ప్రజలకు కావాల్సింది డైలాగులు కాదు.. వాస్తవాలు, ఉద్యోగాలు, భవిష్యత్తు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు” అని వంశీకృష్ణ అన్నారు.పదవులు శాశ్వతం కాదని, ప్రజల భవిష్యత్తే శాశ్వతమైన అంశమని ఎంపీ వ్యాఖ్యానించారు. కుటుంబ సభ్యులకు పదవులు, నామినేటెడ్ పోస్టులు, ఎమ్మెల్సీ, రాజ్యసభ అవకాశాలు కల్పించారనే విమర్శలు ప్రజల్లో ఉన్నాయని అన్నారు. “మేము నామినేటెడ్ పదవులతో రాలేదు. ప్రజలు మాకు ఓటు వేసి గెలిపించారు. ప్రజలు ఇచ్చిన బాధ్యతతో ప్రజల కోసం పనిచేస్తున్నాం” అని పేర్కొన్నారు.తెలంగాణ యువతను ప్రపంచస్థాయిలో నిలబెట్టడమే తమ లక్ష్యమని వంశీకృష్ణ అన్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు కూడా జర్మనీ, జపాన్ వంటి దేశాలకు వెళ్లి అంతర్జాతీయ స్థాయిలో విద్య, నైపుణ్యాలు, ఉద్యోగ అవకాశాలు పొందేలా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.“మీకు నిజంగా ధైర్యం ఉంటే రాజకీయ డైలాగులు చెప్పడం కాకుండా తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించే పనులు చేయండి. యువత భవిష్యత్తు కోసం పనిచేయండి. తెలంగాణ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారు. ప్రజల తీర్పే అంతిమ తీర్పు” అని అన్నారు. తెలంగాణ యువత హక్కుల కోసం, వారి భవిష్యత్తు కోసం తాము నిరంతరం పోరాడుతామని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు.

భూ రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి

10 రోజుల్లో రీ-సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి
ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలి
జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ జిల్లా: ప్రతినిధి తెలంగాణ పవర్: సెప్టెంబర్-7: భూముల రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు.

నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, సర్వే బృందం, సంబంధిత అధికారులతో మాట్లాడి ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., భూముల రీ-సర్వే ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులతో సరిపోల్చాలని సూచించారు.

వెంకటాపూర్ గ్రామంలో మొత్తం 95 సర్వే నంబర్ల పరిధిలో 661 ఎకరాల 4 గుంటల భూమి ఉన్నట్లు అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా సర్వే చేసిన గ్రామ సరిహద్దుల మొత్తం విస్తీర్ణం 670 ఎకరాల 15 గుంటలు, గ్రామకంఠం విస్తీర్ణం 14 ఎకరాల 14 గుంటలు, పాత గ్రామకంఠం విస్తీర్ణం 4 ఎకరాల 24 గుంటలు ఉన్నట్లు తెలిపారు.ప్రస్తుతం గ్రామంలో రోడ్ల సర్వే కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రోడ్ల సర్వే పూర్తయిన అనంతరం ప్రభుత్వ భూముల సర్వే, ఆ తర్వాత పట్టా భూముల సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు.

భూ రీ-సర్వే పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా మొత్తం రీ-సర్వే ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

సర్వే ప్రక్రియలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలను సంబంధిత రికార్డులతో సమన్వయం చేసుకుంటూ నమోదు చేయాలని సూచించారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ ఆదేశించారు.

భూ రీ-సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డులను మరింత స్పష్టంగా నిర్ధారించేందుకు అవకాశం ఉన్నందున, ఈ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు.

అదేవిధంగా గ్రామంలో బూత్ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి ఓటర్ల జాబితా ప్రకారం నోటీసుల జారీ, నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువపత్రాల ఆధారంగా ఆన్లైన్ నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు.

ఓటర్ల జాబితా ప్రక్రియను సజావుగా నిర్వహించేలా బూతు స్థాయి అధికారులు, గ్రామస్థాయిలోని బూత్ స్థాయి పార్టీల ఏజెంట్లతో సమన్వయం చేసుకొని ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ తబితా రాణి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ గిరిధర్, డిప్యూటీ సర్వేయర్, లైసెన్స్ సర్వేయర్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

గ్రామపంచాయతీ, వివో భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్

నాగర్ కర్నూల్ జిల్లా: ప్రతినిధి తెలంగాణ పవర్: సెప్టెంబర్-7: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు సొంతింటి కలను సాకారం చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్మాణ పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనం, విలేజ్ ఆర్గనైజేషన్ (ఆ) భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు.

సోమవారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, గ్రామపంచాయతీ భవనం, వివో భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

వెంకటాపురం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

గ్రామంలో మొత్తం 12 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 8 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, మరో 2 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని, ఆయా లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

ఈ సందర్భంగా నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులను కలెక్టర్ పిలిపించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు.

నిర్మాణ పనులు ప్రారంభించకపోతే మంజూరు రద్దు చేసే అవకాశం ఉంటుందని, కలెక్టర్ స్పష్టం చేశారు.దీనికి స్పందించిన లబ్ధిదారులు రానున్న రెండు, మూడు రోజుల్లో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని కలెక్టర్‌కు తెలిపారు.

అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటి పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడరాదని, నిర్దేశిత ప్రమాణాల మేరకు పనులు జరిగేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు.



అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనం, విలేజ్ ఆర్గనైజేషన్ (ఆ) భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా భవనాల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గ్రామపంచాయతీ భవనం, వివో భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని, వివో భవనం మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు, సమావేశాలు మరియు ఇతర కార్యక్రమాలకు అనువుగా ఉండేలా నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని తెలిపారు.

ప్రభుత్వ నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడకుండా, నిర్దేశిత అంచనాలు, మార్గదర్శకాల ప్రకారం పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.

జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, నాగర్ కర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ, గ్రామ సర్పంచ్ నరసింహ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

అంబేద్కర్ ను అవమానిస్తే ఊరుకోం - హమారా ప్రసాద్ పై కేసు నమోదు చెయ్యాలి వంగూరి జయశంకర్

టీఎంజేఎఫ్, దళిత సంఘాల ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు



నాగర్ కర్నూల్ జిల్లా: ప్రతినిధి తెలంగాణ పవర్: సెప్టెంబర్- 7 : రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ ను కించపరుస్తూ, ఆయనను 'కల్పిత నాయకుడు' అంటూ 'కల్పిత నాయకుడు - ది ఫ్యాబ్రికేటెడ్ లీడర్' అనే పుస్తకం రాసిన రచయిత హమారా ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ జర్నలిస్టు వంగూరి జయశంకర్ ఆధ్వర్యంలో టీఎంజేఎఫ్, దళిత సంఘాల నాయకులు సోమవారం నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ లో సీఐ వెంకట్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు.

ఈ సందర్భంగా వంగూరి జయశంకర్ మాట్లాడుతూ "బాబాసాహెబ్ అంబేద్కర్ ను 'కల్పిత నాయకుడు' అనడం కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. ఆ పుస్తకంలో అంబేద్కర్ గారిని 'దేశ వ్యతిరేకి, హిందూ వ్యతిరేకి, వేర్పాటువాది' అంటూ చిత్రీకరించి సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా రాశారు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛ కాదు, నేరుగా రాజ్యాంగంపై చేస్తున్న దాడి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంబేద్కర్ గారు ఆర్టికల్ 14 ద్వారా ఇచ్చిన సమానత్వపు హక్కు, ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనాన్ని నిషేధించడం వల్లే ఈ రోజు మేమంతా గౌరవంగా బతుకుతున్నామని, అలాంటి మహనీయుడిని అవమానిస్తే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

మా డిమాండ్లు:

1. హమారా ప్రసాద్ పై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం మరియు బీఎన్ఎస్ సెక్షన్ల కింద వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలి.
2. 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని తెలంగాణ ప్రభుత్వం వెంటనే నిషేధించాలి.
3. ఇలాంటి విద్వేషపూరిత రచనలను ప్రోత్సహిస్తున్న వారిపై కూడా విచారణ జరపాలి.

ఈ కార్యక్రమంలో టీఎంజేఎఫ్. జిల్లా కన్వీనర్ వెంకటేష్ ప్రతినిధులు, దళిత దండు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త నాగేష్ సంఘాల నాయకులు జెట్టి కిషోర్ , మాదిగ జర్నలిస్టుల ఫోరం సభ్యులు సుధాకర్. మహేష్. వినోద్. పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



మెదక్ ప్రతినిధి సెప్టెంబర్ 07 తెలంగాణ పవర్ : పాపన్నపేట మండలం నార్సింగి గ్రా శివారులోమ వెలసిన దారిదేవుని ఆలయంలో ఆఖరి శ్రావణ సోమవారం సందర్భంగా నిర్వహించి ప్రత్యేక పూజలు కన్నుల పండగగా జరిగాయి.ఆలయ పూజరులు దారప్ప,ప్రసాద్ అధ్వర్యంలో సోమవారం వేకువ జామున గణపతి పూజతో పూజలు ప్రారంభమైయ్యాయి.అనంతరం పరమశివుడికి పళ్ళ రసాలతో విశేషాలంకరణ చేసి, పంచామృత అభిషేకం,అమ్మవారికి కుంకుమార్చన, ఓడిబియ్యం తో పాటు విశేష రుద్రాభిషేకాలు, బిల్వార్చన, లింగార్చనలు తదితర కార్యక్రమాలు చేపట్టారు.మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టేక్మాల్,పాపన్నపేట మండలంలోని పలు గ్రామాల నుండి భక్తులు భారీగా తరలివచ్చి తీర్థప్రసాదాలు స్వీకరించారు

పాపన్నపేట పద్మశాలీల ఆధ్వర్యంలో ఘనంగా గోపాల కాల్వల పూజ,ఆంజనేయ స్వామీ,శివునికి అభిషేకం కార్యక్రమం



మెదక్ ప్రతినిధి,సెప్టెంబర్07: తెలంగాణ పవర్ .మండల కేంద్రమైన పాపన్నపేటలో పద్మశాలీ కులసంఘం ఆధ్వర్యంలో ఆఖరి శ్రావణ సోమవారం సందర్భంగా గోపాల కాల్వల కార్యక్రమం,శివునికి, ఆంజనేయ స్వామీకి ప్రత్యేక అభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా ఈశ్వరాలయం ప్రధాన అర్చకులు చెరువుపల్లి విశ్వనాథ శర్మ ఆధ్వర్యంలో పద్మశాలి కులస్థులచే ఉదయాన్నే లింగాభిషేకం,పత్ర పూజ, ఆంజనేయ స్వామికి చంద్రం,నవగ్రహ దేవతా పూజలు నిర్వహించారు.అనంతరం గ్రామంలోని ఆలయాలు, ప్రధాన కుడళ్ళ వద్ద ఉట్టి కొట్టే కార్యక్రమంలో కులస్థులు,పెద్దలు యువకులు,పిల్లలు,మహిళలు హుషారుగా పాల్గొన్నారు.
కులదైవం ఆధ్వర్యంలో గ్రామస్థులకు అన్నసంతార్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పద్మశాలి కులదైవం పెద్దలు, కులస్తులు,మహిళలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గణనాథుడి ఉత్సవాల్లో అప్రమత్తతే.. భద్రతకు శ్రీరామరక్ష

పీస్ కమిటీసమావేశంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ సూచనలు

మెదక్ ప్రతినిధి, సెప్టెంబర్ 7: తెలంగాణ పవర్: గణేష్ నవరాత్రిఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్ కోరారు. వినాయక ఉత్సవాలు ఆనందానికి ప్రతీకగా నిలవాలని, చిన్నపాటి నిర్లక్ష్యం కారణంగా అవాంఛనీయ ఘటనలుచోటుచేసుకోకుండా నిర్వాహకులు, భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

గణేష్ నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సోమవారంపాపన్నపేట ఎస్ ఐ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన మంజీరా గార్డెన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈసమావేశానికి ముఖ్యఅతిధిగా డీఎస్పీ ప్రసన్న కుమార్ హాజరై మాట్లాడుతూ.. గణనాథుడి ఉత్సవాలు భక్తి, ఐక్యత,సోదరభావానికి ప్రతీకగా నిలవాలని ఆకాంక్షించారు.

అనుమతులుతప్పనిసరి

గణేష్ మండపాల ఏర్పాటుకు ముందుగా పోలీసులు, విద్యుత్ శాఖ నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలనినిర్వాహకులకు సూచించారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేయవద్దని స్పష్టం చేశారు. మండపాల వద్ద భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

విద్యుత్ ప్రమాదాలపైఅప్రమత్తత

మండపాల వద్ద విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ విషయంలో నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డీఎస్పీ సూచించారు. నాణ్యత లేని వైర్లు, అస్తవ్యస్తంగా వేలాడే విద్యుత్ తీగలు, ఓవర్‌లోడ్ కనెక్షన్లతో ప్రమాదాలకు అవకాశం లేకుండా విద్యుత్ శాఖ నిబంధనలను పాటించాలని తెలిపారు. చిన్న నిర్లక్ష్యం ప్రాణాలకు ముప్పుగా మారకుండా ముందస్తు జాగ్రత్తలే రక్షణగా నిలవాలని అన్నారు.

పెద్ద శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు వద్దు

ఉత్సవాల పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా అధిక శబ్దంతో డీజేలు, సౌండ్ సిస్టమ్స్ వినియోగించవద్దని సూచించారు. శబ్ద కాలుష్యానికి కారణమయ్యే పరికరాలను నిబంధనలకు విరుద్ధంగాఉపయోగించరాదని, ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు బాధ్యతగావ్యవహరించాలని కోరారు.

నిమజ్జనంలో మరింత జాగ్రత్త

వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో భక్తులు, యువకులు అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. చెరువులు, కుంటలు, నీటి వనరుల వద్ద లోతైన ప్రాంతాల్లోకి వెళ్లకూడదని, ఈత రానివారు నీటిలోకి దిగరాదని హెచ్చరించారు. చిన్నారులను తల్లిదండ్రులు దగ్గరుండి పర్యవేక్షించాలని, నిమజ్జన సమయంలో పోలీసుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని కోరారు. పండుగ ఉత్సాహం ప్రమాదాలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. ఒకరి ఆనందం మరొకరికి అసౌకర్యంగా మారకుండా.. ప్రతి ఒక్కరి భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ గణేష్ నవరాత్రులను ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ప్రజల భద్రత,శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు నిరంతరం అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏదైనా సమస్య తలెత్తినా, అనుమానాస్పద పరిస్థితులు కనిపించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

"గణనాథుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి.. ప్రతి గుండెలో సోదరభావం నిండాలి.. ఉత్సవాలు సురక్షితంగా, ప్రశాంతంగా ముగియాలి" అని డీఎస్పీ ప్రసన్నకుమార్ఆకాంక్షించారు.ఈ సమావేశంలో వివిధ గ్రామాల గణేష్ మంటపాల నిర్వాహకులు, యువకులు, ప్రజా ప్రతినిధులు,పోలీసు అధికారులు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

మహిళల వస్త్ర సముదాయం 'శ్రీ' ప్రారంభం

- నగర మార్కెట్లోకి గ్రాండ్ ఎంట్రీ

- రెండేళ్లలో మరో 25 అవుట్‌లెట్లు లక్ష్యం

హైదరాబాద్, సెప్టెంబర్ 6, 2026: మహిళల మనస్సు దోచే సరికొత్త వస్త్రసముదాయం 'శ్రీ' నగరంలోని టీఎన్ఆర్ నార్త్ సిటీ మాల్‌లో మొట్టమొదటి రిటైల్ స్టోర్ను ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ 2026 రమ్య కైలాసా, సంస్థ సహ-వ్యవస్థాపకులు సందీప్ కపూర్, శీతల్ కపూర్ ప్రారంభించారు. ఆన్‌లైన్ ద్వారా రాష్ట్రంలో ఇప్పటికే మంచి ఆదరణ పొందింది. దేశ, విదేశాలలో 130 పైగా స్టోర్లతో మహిళల ఆదరణ చూరగొంది. రాబోయే రెండేళ్లలో తెలంగాణలో 20 నుంచి 25 స్టోర్లను ఏర్పాటు లక్ష్యంగా పెట్టుకుంది. స్థానికంగా ఉపాధి కల్పిస్తూ తన ఆఫ్‌లైన్ నెట్‌వర్క్‌ను విస్తరించాలన్న ఉద్దేశంతో అడుగులు వేస్తుంది. ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఆర్ లైఫ్‌స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ కపూర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ఏళ్లుగా మా వద్ద ఆన్‌లైన్‌లో దుస్తులు కొనుగోలు చేస్తున్న కస్టమర్లు ఉన్నారన్నారు. ఆ గణాంకాలే ఇక్కడ ఆఫ్‌లైన్ స్టోర్ ఏర్పాటు చేయడానికి కారణమన్నారు. ఇక్కడ మరో 20 నుంచి 25 స్టోర్లను ప్రారంభించడం చిన్న లక్ష్యమేమీ కాదన్నారు.

ఈ సందర్భంగా ఎస్‌హెచ్ఆర్ లైఫ్‌స్టైల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహ-వ్యవస్థాపకురాలు శీతల్ కపూర్ మాట్లాడుతూ హైదరాబాద్ శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఆ ప్రగతి ప్రయాణంలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. మేం మహిళలను దృష్టిలో ఉంచుకునే మా దుస్తులను డిజైన్ చేస్తున్నామన్నారు. ఉదయం 8 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి, రాత్రి 9 గంటలకు తిరిగొచ్చే మహిళలు మధ్యలో ఉద్యోగం, కుటుంబ బాధ్యతలు, అప్పుడప్పుడు పెళ్లిళ్లు, వేడుకలు ఇలా ఎన్నో చూసుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి వారికి ఆకర్షణీయంగా కనిపించే దుస్తులతో పాటు రోజంతా సౌకర్యంగా ఉండేవి కావాలన్నారు. ఈ రెండింటి కలయిక అంత సులభం కాదన్నారు. ఒక స్టోర్‌కు వచ్చినప్పుడు స్వయంగా ఫ్యాబ్రిక్ నాణ్యతను, ఫిట్టింగ్‌ను చూసుకోవచ్చన్నారు.



తీరికగా ఎంచుకోవచ్చన్నారు. స్క్రీన్‌పై చూసి కొనేటప్పుడు ఈ అనుభూతి లభించదన్నారు. భారతదేశంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రిటైల్ మార్కెట్లలో హైదరాబాద్ ఒకటిగా ఉండటం, రాష్ట్రవ్యాప్తంగా మాల్స్, ఫ్యాషన్ రిటైల్ రంగం శరవేగంగా విస్తరిస్తుండటం అనుకూల అంశం. ఈ స్టోర్‌లో ప్రత్యేక సందర్భాల కోసం రూపొందించిన చీరల నుంచి రోజువారీ కుర్తాలు, దుపట్టాతో కూడిన కుర్తా సెట్లు, కుర్తీలు, ట్యూనిక్స్, కో-ఆర్డ్స్ వంటి ఆధునిక వర్క్‌వేర్‌లతో పాటు వైడ్ లెగ్ ప్యాంట్లు, లెగ్గింగ్స్ వంటి బాటమ్ వేర్ సహా మహిళల పూర్తి స్థాయి ఎత్నిక్ వేర్ కలెక్షన్‌ను అందుబాటులో ఉంచారు. జాతీయ స్థాయిలో 25 లక్షలకు పైగా కుటుంబాలకు చేరువైన ఈ బ్రాండ్ ఇప్పటివరకు 75 లక్షలకు పైగా దుస్తులను విక్రయించింది. అంతర్జాతీయంగా తన ఉనికిని విస్తరిస్తూ.. సొంత వెబ్‌సైట్ ఎఒఒ.ఎఒంష్ట్రతీవవ.ఒశీఎ తో పాటు వీఎఅతీఖి, ూూఖిఒశీఅ, చీఎఒఖి ఖీంష్ట్రఅశీఅ వంటి ప్రధాన ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో కూడా ఆన్‌లైన్ స్థానాన్ని సంపాదించుకుంది.

ఇందిరమ్మ ఇంటికి భూమిపూజ

వేములవాడ, సెప్టెంబర్ 07: భూమి ఉండి ఇల్లు లేని నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా వేములవాడ 14వ వార్డులో ఇంటి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంకల్పంతో, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సహకారంతో సుంకర వేణి, శ్రీదేవి, శ్రావణ్ కుటుంబానికి తొలి విడతగా రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇంటి నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు.

కార్యక్రమంలో వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, 14వ వార్డు కౌన్సిలర్ తూము మధు, వార్డు అధికారి పరశు రాములు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎస్‌కే సాబీర్, చొప్పరి భాస్కర్, మానుపాటి పరశురాములు, గొడిశాల రేణుక తదితరులు పాల్గొన్నారు. తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించేందుకు సహకరించిన నాయకులకు సుంకర వేణి, శ్రీదేవి, శ్రావణ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించారు.





మండలి కోసం పోటా పోటీ

వరంగల్, సెప్టెంబర్ 7, (న్యూస్ పల్స్) తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న మహబూబ్‌నగర్-హైదరాబాద్-రంగారెడ్డి, అలాగే నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల వేడి గాంధీభవన్‌లో ఇప్పుడే మొదలైంది. అక్టోబర్ నెల నుంచి ఓటరు నమోదు కార్యక్రమాలు ప్రారంభం కానుండటంతో, అధికార పార్టీలో టికెట్ ఆశిస్తున్న నేతల హడావిడి పీక్స్‌కు చేరింది.ఈ రెండు పట్టభద్రుల స్థానాల పరిధిలో ఉమ్మడి ఆరు జిల్లాలు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని మెజారిటీ అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పట్టభద్రుల తీర్పు ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా మారే అవకాశం ఉండటంతో, ఫలితం తేడా వస్తే భవిష్యత్ ఎన్నికలపై ప్రభావం పడుతుందన్న అంచనాతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కీలక మంత్రులు అభ్యర్థుల ఎంపికపై ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు నుంచి నాలుగు పేర్లతో కూడిన షార్ట్‌లిస్ట్‌ను అధిష్ఠానానికి వంపేందుకు నన్నాహాలు జరుగుతున్నాయి.మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి ఆశావహులు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంప్రదింపులు జరిపి జాబితా రూపొందించారు. పార్టీ సీనియర్ నేత, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ విభాగం మాజీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల నేపథ్యం ఉంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నాయి. టీశాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీసీ నేత గౌరి సతీష్, షాప్ మాజీ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యుడు రాకూర్ బాలాసింగ్ పేర్లను కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది.ఇక నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క ప్రత్యేకంగా భేటీ అయ్యారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆర్టీఐ కమిషనర్ పి.వి. శ్రీనివాస్, నల్గొండ డీసీసీ అధ్యక్షుడు కైలాష్ నేత పేర్లు ప్రముఖంగా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసిన ఇందిర, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, పార్టీ నేత లోకేష్ యాదవ్, ఖమ్మం విద్యాసంస్థల అధినేత మొండిం కిరణ్‌కుమార్ ఆశావహుల జాబితాలో ఉన్నారు. మరోవైపు పొత్తులో భాగంగా ఈ సీటు తమకు కేటాయించాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కోరుతుండటం గమనార్హం.పట్టభద్రుల స్థానాలతో పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో నాలుగు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు భర్తీకి రానున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14న ముగియనుంది. డిసెంబర్ 18న మధుసూదనాచారి పదవీకాలం పూర్తవుతుంది. కళాకారుల కోటాలో సీఎంతో సన్నిహిత సంబంధాలున్న గోరటి వెంకన్నను మళ్లీ కొనసాగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ద్వారా నామినేట్ అయి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న బస్వరాజు సారయ్య మళ్లీ అవకాశం ఆశిస్తున్నారు. మరోవైపు సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పేర్లు గవర్నర్ కోటా రేసులో బలంగా వినిపిస్తున్నాయి.సామాజిక సమీకరణాలు, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. గ్రౌండ్ రియాలిటీని బేరీజు వేసుకుంటూ, ఆశావహుల అసంతృప్తి పార్టీపై పడకుండా శాసనమండలి పోరులో క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా హస్తం పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది.

మజ్లిస్ తో రేవంత్ సంబంధం

హైదరాబాద్, సెప్టెంబర్ 7, (న్యూస్ పల్స్)తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరుగుతోందా? పాతబస్తీ రాజకీయాల నాడిని శాసించే మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార, విపక్షాల్లో చర్చనీయాంశంగా మారాయి. సైదాబాద్ వద్ద నిర్మించిన నూతన స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ వేదిక ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ఒకే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రశంసలు కేవలం అభివృద్ధి సంకేతాలు మాత్రమే కావని, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాల ఆరంభానికి సూచికలని విశ్లేషకులు భావిస్తున్నారు.గతంలో తాము బీఆర్ఎస్ కి మద్దతు ఇచ్చిన విషయాన్ని అంగీకరించిన అసదుద్దీన్, తెరవెనుక జరిగిన ఒక కీలక హెచ్చరికను బయటపెట్టారు. "రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని నేను స్వయంగా కేసీఆర్‌కు పదే పదే చెప్పాను" అని వ్యాఖ్యానించడం ద్వారా గత ప్రభుత్వ పతనానికి రేవంత్ దూకుడే కారణమనే అంశాన్ని నొక్కిచెప్పారు. ఇది బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎత్తిచూపడమే కాకుండా, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు ఇచ్చిన భారీ సర్టిఫికెట్‌గా నిలిచింది.అసదుద్దీన్ ప్రసంగంలో అత్యంత కీలకమైన రాజకీయ కోణం.. పార్టీని కాదని రేవంత్ రెడ్డి వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించడం. "నేను మద్దతు ఇస్తున్నది రేవంత్ రెడ్డికి మాత్రమే, కాంగ్రెస్ పార్టీకి కాదు" అని కుండబద్దలు కొట్టారు. సాధారణంగా ఎంఐఎం అధికారంలో ఉన్న పార్టీలతో సత్సంబంధాలు నెరపుతుందనే ఒక ముద్ర ఉంది. అయితే ఈసారి అసదుద్దీన్ కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదా హస్తం పార్టీ సిద్ధాంతాలకు కాకుండా, నేరుగా సీఎం రేవంత్ రెడ్డి పాలనా శైలికే తమ బాసట అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ సహా సమగ్ర తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మరీ ఎక్కువ మర్యాదస్తుడిగా మారిపోయారని, గతంలో మాదిరి దూకుడును ప్రదర్శిస్తూ ప్రజల్లోకి రావాలని హితవు పలికారు.మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అసదుద్దీన్ ఏమాత్రం తీసిపోరని రేవంత్ తేల్చిచెప్పారు. కొందరు కావాలనే అసద్‌పై, ఎంఐఎంపై దేశద్రోహ ముద్ర వేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అసదుద్దీన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న రేవంత్, ఓల్డ్ సిటీ సమగ్ర పురోగతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తాను సీఎం అయ్యాక ఓవైసీ సోదరులతో పాతబస్తీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించానని గుర్తుచేశారు. పాతబస్తీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీ అసద్ ఇచ్చే ఏ ప్రతిపాదనలనైనా తక్షణమే పరిశీలించి నిధులు విడుదల చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆ వేదికపైనే రేవంత్ ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీని పక్కనపెట్టి కేవలం రేవంత్ రెడ్డికే మద్దతు ప్రకటించడం ద్వారా అసదుద్దీన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇది ఒకవైపు కాంగ్రెస్‌తో తాము పూర్తిగా కరిగిపోలేదని మజ్లిస్ క్యాడర్‌కు స్పష్టం చేస్తూనే, మరోవైపు ప్రభుత్వ సారథి అయిన రేవంత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందనే సందేశాన్ని ఇచ్చింది. అటు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్ రాజకీయంలో పాతబస్తీ మద్దతును సంపూర్ణంగా తన ఖాతాలో వేసుకుంటూ, ప్రభుత్వంలో తన పట్టును, ఇమేజ్‌ను మరింత పటిష్టం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు గట్టి హెచ్చరిక పంపడమే కాక, హైదరాబాద్ వేదికగా తిరుగులేని రాజకీయ శక్తిగా తాము కొనసాగుతామని రేవంత్-ఓవైసీల ద్వయం ఈ సభ ద్వారా చాటిచెప్పింది.

రేవంత్ మార్క్ పాలిటిక్స్...

హైదరాబాద్, సెప్టెంబర్ 7, (న్యూస్ పల్స్)కాంగ్రెస్ లో అంతర్గత కుమ్ములాటలకు, నాయకత్వంపై అసమ్మతి గళాలకు ఏఐసీసీ హైకమాండ్ గట్టి ముగింపు పలికింది. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ, కేబినెట్ నుంచి కొండా సురేఖను తప్పించడం ద్వారా అధిష్ఠానం స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సీఎం పీఠాన్ని అధిరోహించే వరకు ప్రతి అడుగులోనూ పరీక్షలు ఎదుర్కొన్న రేవంత్ రెడ్డి, తాజా పరిణామంతో పార్టీపై తన తిరుగులేని పట్టును మరోసారి నిరూపించుకున్నారు. క్రమశిక్షణారాహిత్యాన్ని ఉపేక్షించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పిన ఢిల్లీ పెద్దలు, అసంతృప్త నేతల దూకుడుకు బలమైన కళ్లెం వేశారు.ప్రభుత్వ విధానాలు లేదా ముఖ్యమంత్రి శైలిపై బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్న నేతలకు కొండా సురేఖ ఉద్వాసన ద్వారా అధిష్ఠానం హెచ్చరికలు జారీ చేసింది. క్రమశిక్షణ తప్పితే అది విస్తరించి పార్టీ ఐక్యతకే ముప్పుగా మారుతుందన్న ఉద్దేశంతోనే కాంగ్రెస్ నాయకత్వం ఈ నిర్ణయం తీసుకుంది. రేవంత్‌ను కాదని మరో ప్రత్యామ్నాయ వర్గాన్ని ప్రోత్సహించే ఆలోచన ఏఐసీసీకి లేదని, సీఎంకు పూర్తి స్వేచ్ఛనివ్వడమే సరైన మార్గమని నాయకత్వం భావించింది. ఫలితంగా, ఇన్నాళ్లూ మంత్రివర్గ విస్తరణలో చోటు కోసం లేదా శాఖల మార్పుపై అసంతృప్తి వెళ్లగక్కుతూ వచ్చిన ఆశావహులు ఇప్పుడు ఆచితూచి మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడింది.హైకమాండ్ రేవంత్ రెడ్డికి ఇంతటి అండగా నిలవడానికి బలమైన రాజకీయ, ఎన్నికల కారణాలు ఉన్నాయి. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడం మొదలుకొని.. ఆ తర్వాత జరిగిన పంచాయతీ, పురపాలక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వరకు రేవంత్ నాయకత్వంలో పార్టీ వరుస విజయాలను నమోదు చేసింది. దక్షిణ భారతదేశంలో పార్టీకి అత్యంత కీలకమైన తెలంగాణలో ప్రత్యర్థి పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీలను నిలువరించడంలో రేవంత్ వ్యూహాలు విజయవంతమయ్యాయి. ఈ వనితీరును గుర్తించిన కాంగ్రెస్ అగ్రనాయకత్వం, రేవంత్ నాయకత్వాన్ని బలహీనపరిస్తే పార్టీ పునాదులకే నష్టమని స్పష్టం చేసింది.త్వరలోనే జరగనున్న కీలకమైన పట్టణ స్థానిక సంస్థల సమరానికి పార్టీని సమాయత్తం చేయడమే అధిష్ఠానం తక్షణ లక్ష్యం. హైదరాబాద్ మెట్రోపాలిటన్ రీజియన్‌లోని క్యూర్ పరిధిలోకి వచ్చే జీహెచ్ఎంసీ, మల్కాజ్‌గిరి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు పార్టీ భవిష్యత్తుకు అత్యంత కీలకంగా మారాయి. ఈ నగర పోరుకు ముందు గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి, ఏకతాటిపై పార్టీని నడిపించేందుకు రేవంత్‌కు పూర్తి స్వేచ్ఛను ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించింది.ఈ తాజా రాజకీయ మార్పులతో త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణ, ప్రక్షాళనపై సీఎం రేవంత్ రెడ్డికి పూర్తి వెసులుబాటు దక్కింది. ప్రస్తుతం కేబినెట్‌లో ఖాళీగా ఉన్న 3 మంత్రి పదవులను భర్తీ చేయడంతో పాటు, మంత్రుల పనితీరు ఆధారంగా శాఖల మార్పిడి చేపట్టే స్వేచ్ఛ ఆయనకు లభించింది. పార్టీపై సంపూర్ణ ఆధిపత్యం దక్కించుకున్నప్పటికీ, అసమ్మతి పూర్తిగా సమసిపోలేదన్న వాస్తవాన్ని గ్రహించిన రేవంత్.. అన్ని సామాజిక వర్గాలను, సీనియర్ నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.

దేవాదాయశాఖ సెంటిమెంట్ కంటిన్యూ...

హైదరాబాద్, సెప్టెంబర్ 7, (న్యూస్ పల్స్)రాజకీయాల్లో కొన్ని శాఖలకు ప్రత్యేకమైన గుర్తింపు ఉంటుంది. అందులో దేవాదాయ ధర్మాదాయ శాఖది అత్యంత సున్నితమైన స్థానం. దేవుడి మాన్యాలు, ఆలయ పాలనతో ముడిపడి ఉండే ఈ పోర్ట్‌ఫోలియోను బాధ్యతగా భావించినా.. రాజకీయంగా మాత్రం మంత్రులకు అస్సలు కలిసిరావడం లేదు. ఇది త ఆరు దశాబ్దాల చరిత్ర చెప్తున్న చేదు నిజం. తాజాగా మంత్రివర్గం నుంచి కొండా సురేఖ ఉద్వాసనకు గురికావడంతో మరోసారి దేవాదాయ శాఖ సెంటిమెంట్ తెరపైకి వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలుకొని ఇప్పటి ప్రత్యేక తెలంగాణ వరకు.. ఈ శాఖను చేపట్టిన పలువురు నేతల రాజకీయ ప్రస్థానం ఊహించని మలుపులు తిరిగి, క్రమంగా అస్తమించడమో లేదా తెరమరుగవడమో జరుగుతూ వస్తోంది.ఈ శాఖకు మంత్రుల పదవీకాలానికి ఉన్న విచిత్రమైన లింక్ 1962 నుంచే కనిపిస్తుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలి మహిళా దేవాదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన సదాలక్ష్మి కేవలం ఏడాది తిరిగేలోపే ఆ పదవిని కోల్పోవాల్సి వచ్చింది. శాఖలో ఆమె తీసుకున్న సంస్కరణలు, నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత వెల్లువెత్తడంతో సంక్షేమ శాఖకు మార్చారు. ఆ వెంటనే 1967 ఎన్నికల్లో ఆమె పరాజయం పాలయ్యారు. ఇక 1983 జనవరిలో ఎన్టీఆర్ ప్రభుత్వ హయాంలో ఈ బాధ్యతలు చేపట్టిన ఈలి ఆంజనేయులు పదవిలో ఉండగానే కేవలం నెలల వ్యవధిలోనే అనారోగ్యంతో కన్నుమూశారు1999?2004 మధ్య చంద్రబాబు రెండోసారి సీఎంగా ఉన్న సమయంలో దామోదరం ఆంజనేయులు 1999లో దేవాదాయ శాఖ బాధ్యతలు తీసుకున్నారు. 2001 నాటి కేబినెట్ పునర్వ్యవస్థీకరణ, రాజకీయ సమీకరణాల్లో పదవి కోల్పోయారు. ఆ తర్వాత బాధ్యతలు చేపట్టిన దండు శివరామరాజు 2004 సాధారణ ఎన్నికల్లో ఓటమి చెంది, ఆపై ప్రత్యక్ష రాజకీయాలకు దూరమయ్యారు.దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనూ ఈ గండం కొనసాగింది. 2004-2005 మధ్య 14 నెలలపాటు బాధ్యతలు నిర్వర్తించిన ఎం.సత్యనారాయణ రావు.. హైదరాబాద్ పరిధిలోని దేవరయాంజాల్ భూముల వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొని పదవిని వీడాల్సి వచ్చింది. క్రీడల శాఖకు మారినా, ఏడాదిలోనే రాజీనామా చేయాల్సి వచ్చింది. అనంతరం 2009 ఎన్నికల్లో వేములవాడ నుంచి పోటీ చేసి ఓడిపోయి రాజకీయాలకు దూరమయ్యారు. వైఎస్ కేబినెట్‌లోనే 2009 మే నుంచి దేవాదాయ శాఖ నిర్వహించిన జూపల్లి కృష్ణారావు, 2011 జూన్ 1న తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. అటు 2014లో ఏపీ టీడీపీ-బీజేపీ సంకీర్ణ ప్రభుత్వంలో ఈ శాఖ చూసిన మాణిక్యాలరావు 2019 ఎన్నికల్లో కనీనం డిపాజిట్ కూడా దక్కించుకోలేకపోయారు. ఆ తర్వాత ఆయన కన్నుమూశారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ఏడాది పాటు ఎవరికీ ఈ బాధ్యతలు అప్పగించలేదు. 2014 డిసెంబరులో అల్లోల ఇంద్రకరణ్ రెడ్డికి దేవాదాయ శాఖ దక్కింది. 2018 ఎన్నికల తర్వాత కేసీఆర్ రెండో కేబినెట్‌లోనూ 2023 ఎన్నికల వరకు ఆయనే కొనసాగినప్పటికీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. సుదీర్ఘకాలం శాఖను నడిపించినా ఆయనకు రాజకీయంగా పెద్దగా మైలేజ్ దక్కలేదనే వాదన ఉంది.ఇక 2023 డిసెంబరులో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖలను చేపట్టిన కొండా సురేఖ సైతం పలు రాజకీయ వివాదాల్లో చిక్కుకుని అనూహ్యంగా మంత్రివర్గం నుంచి ఉద్వాసనకు గురయ్యారు. గతంలో కేసీఆర్ హయాంలో ఆరోగ్యశాఖ నిర్వహణ లోపాల వల్ల పదవి కోల్పోయిన డాక్టర్ టి.రాజయ్య, ఇప్పుడు పదవి కోల్పోయిన కొండా సురేఖ.. ఇద్దరూ ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలే కావడం కాకతాళీయం.సంక్షేమ పథకాలు, భారీ బడ్జెట్లు, రాజకీయ పలుకుబడిని పెంచే ఇతర శాఖలతో పోలిస్తే.. దేవాదాయ శాఖ పూర్తి భిన్నమైనది. భూముల వివాదాలు, ఆలయ నిధులు, స్థానిక ఆధిపత్య పోరు ఈ శాఖను నిరంతరం పర్యవేక్షణలో ఉంచుతాయి. కారణాలు పాలనాపరమైనవి కావొచ్చు, రాజకీయ సమీకరణాలు కావొచ్చు.. కానీ దేవాదాయ శాఖ పగ్గాలు పట్టిన నేతలకు కాలం కలిసిరావడం లేదన్న భావన రాజకీయ వర్గాల్లో బలంగా నాటుకుపోతోంది.

రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మహాభారతం చూపెట్టిండు : మన్నె క్రిశాంక్

రాహుల్ గాంధీ అదానీ, నరేంద్రమోదీ ఫొటోలు వేసుకుంటే తప్పు లేనిది.. ఇవాళ మేము కాంగ్రెస్ హామీల గురించి నల్లచొక్కా వేసుకుంటే తప్పయిందా..? అని బీఆర్ఎస్ నాయకుడు మన్నె క్రిశాంక్ ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై పోలీసుల దౌర్జన్యాన్ని మన్నె క్రిశాంక్ తీవ్రంగా ఖండించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో అదానీ టీ షర్ట్ వేసుకుని పోయిర్రు కదా.. హరీశ్ రావు ఏడు సార్లు ఎమ్మెల్యే.. ఇప్పటివరకు ఓడిపోయింది లేదు.. బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ ఆయనను మీరు కింద పడేస్తరు.రేవంత్ రెడ్డి అయినా ఎన్నికల్లో ఓడిపోవచ్చు కానీ సబితా ఇంద్రారెడ్డి ఏనాడు కూడా ఓడిపోలేదు. వారి జుట్టు పీకుతరు..పోలీసులు జుట్టు లాగడం చూశాం.. రాష్ట్రంలో ఉన్న మహిళలు చూస్తున్నరు.. ఇందిరమ్మ పేరు పెట్టి సిగ్గు తీస్తున్నవ్ కదా రేవంత్ రెడ్డి.. ఇందిరమ్మ బ్రేక్ ఫాస్ట్ అంటవ్..అది బండ్ ఉంటది.. ఇందిరమ్మ చీరటలంటవ్..అవి పంపిణీ ఉండదు.. ఇందిరమ్మ రాజ్యంలో మహిళా ఎమ్మెల్యేల జుట్టు లాగుతరా..? సునితమ్మ చీర లాగుతరా..? అని ప్రశ్నించారు. ఇవాళ పుస్తకాల్లో చదివిన మహాభారతం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చూపెట్టిండు. కౌరవులందరు కలిసి అక్కడ మహిళలను అవమానపరిచారు. కౌరవ కాంగ్రెస్ అందరూ అక్కడ మహిళలను అవమానపరిచారన్నారు.



ప్రభుత్వానికి అసెంబ్లీలో చర్చించే ధైర్యం లేకనే అక్రమ అరెస్ట్ లు చేయిస్తుంది...

మాజీమంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్



హైదరాబాద్,అసెంబ్లీ సమావేశాలకు రమ్మని బయటే అరెస్ట్ లు చేయడం అప్రజాస్వామికం. ప్రభుత్వానికి అసెంబ్లీలో చర్చించే ధైర్యం లేకనే అక్రమ అరెస్ట్ లు చేయిస్తుందని మాజీ మంత్రి ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మహిళా సభ్యుల పట్ల వ్యవహరించిన తీరు అత్యంత దుర్మార్గం. పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించి సభ్యులను అరెస్ట్ చేయాల్సిన అవసరం ఏముంది. ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకే నల్ల టీ షర్ట్ లతో బిఆర్ఎస్ పార్టీ సభ్యులు వచ్చారు. అసెంబ్లీ లోపలికి వెళ్ళక ముందే అరెస్ట్ దుర్మార్గమని అన్నారు. పార్లమెంట్ కు రాహుల్ గాంధీ నల్ల టీ షర్ట్ వేసుకెళ్ళొచ్చు... మా సభ్యులు మాత్రం వేసుకోవద్దా. అక్రమ అరెస్ట్ లు చేసినంత మాత్రాన తాము ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఆపబోమని అన్నారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ఆధ్వర్యంలో 2000 మంది ఆడపడుచులకు సామూహిక శ్రీమంతం

అంగరంగ వైభవంగా జరిగిన సామూహిక శ్రీమంతం అన్న అనే మాటను సార్థకం చేసుకుని..పుట్టింటి కానుకగా చీర-సారె, పసుపు, కుంకుమ అందజేసిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే.

.పోషకాహార వారోత్సవంలో భాగంగా నవయువ నిర్మాణ్ సంస్థ మరియు కాంగ్రెస్ పార్టీ సంయుక్త ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్‌గూడ మహమ్మద్ ఫంక్షన్ హాల్‌లో సామూహిక శ్రీమంతాలు,అన్నప్రాసన కార్యక్రమాన్ని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి. నవీన్ యాదవ్ ఘనంగా నిర్వహించారు..ఈ కార్యక్రమానికి సుమారు 2,000 మంది గర్భిణీలు, చిన్నారులు అధిక సంఖ్యలో హాజరై నందడి చేశారు..కాబోయే తల్లులకు ఆరోగ్యం, ఆనందం, ఆయురారోగ్యాలతో నిండిన జీవితం కలగాలని ఆకాంక్షిస్తూ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ గారు పుట్టింటి కానుకగా చీర-సారెతో పాటు పసుపు, కుంకుమ అందజేసి సామూహికంగా శ్రీమంతం చేశారు..అన్నగా అండగా నిలిచి.. ఆడపడుచుల పట్ల తనకున్న ఆప్యాయతను చాటుకుంటూ, పేద కుటుంబాలకు చెందిన మహిళలకు అండగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేశారు..అదేవిధంగా చిన్నారి తొలిసారిగా అన్నం రుచి చూసే మధురమైన, చిరస్మరణీయమైన అన్నప్రాసన కార్యక్రమాన్ని గద్వాల్ విజయలక్ష్మి , జూబ్లీహిల్స్ ఎమ్మెల్యేశ్రీ వి. నవీన్ యాదవ్ రు కలిసి నిర్వహించి చిన్నారులకు ఆశీస్సులు అందించారు..ఈ కార్యక్రమనికి ఒఖఅఅ అధ్యక్షులు, మహేష్ కుమార్ మంత్రులు,దుద్దిల్లా శ్రీధర్ బాబు, సీతక్క, అజ్జరుద్దీన్రు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు గద్వాల విజయలక్ష్మి గారు,మైనార్టీ నాయకులు ఫాహీం ఖురేషి ..ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాజీ ఎంపీ మధుయాష్ గౌడ్ , ఓఒఅ అద్దంకి దయాకర్ .. ఎమ్మెల్యేలు, దానం నాగేందర్ , మరియు ఉత్తమ్ పద్మావతి రెడ్డి ,చిత్తం పర్ణిక రెడ్డి , యశస్విని రెడ్డి , టీజీ సోషల్ మీడియా ప్రెసిడెంట్ సామ రామ్మోహన్ రెడ్డి , గద్దర్ వెన్నెలరు, కాల్వ సుజాత , కొత్తకోట సీతా దయాకర్ రెడ్డి , దీపక్దీపక్ జాన్ ,సరిత తిరుపతయ్య , చిత్రపురి కాలనీ ప్రెసిడెంట్ వల్లభనేని అనిల్ ఇతర కాంగ్రెస్ పార్టీ నాయకులు, ,తదితరులు, హాజరయ్యారు..



హామీలను అమలు చేయాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేత



నారాయణపేట : ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్ వరకు డప్పు వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు,మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ హామీలను అమలు చేయాలేని కాంగ్రెస్‌ను తొలగించి తెలంగాణకు కాపాడుకోవాలని పిలుపు నిచ్చారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ విధానాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

రన్‌వే నుంచి దూసుకెళ్లిన కార్గో విమానం.. అయిదుగురు మృతి



మియామి: అమెరికాలోని మియామి అంతర్జాతీయ విమానాశ్రయంలో .. అమెజాన్ కార్గో విమానం కూలింది. రన్‌వేపై ల్యాండ్ అవుతున్న సమయంలో ఆ విమానం పక్కకు దూసుకెళ్లింది. ఈ ఘటనలో అయిదురు మృతిచెందారు. మరో అయిదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రన్‌వేపై దిగిన తర్వాత ఆ విమానం సమీపంలో పార్క్ చేసిన కార్ల వైపు దూసుకెళ్లిన వీడియో ప్రస్తుతం వైరల్ అవుతోంది. బోయింగ్ 767-300 కార్గో విమానం ఫ్యూర్టో రికాలోని లూయిన్ మునోజ్ మారిన్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయలుదేరింది. అయితే ప్రమాద ఘటన పట్ల దర్యాప్తు చేపట్టినట్లు అమెజాన్ సంస్థ పేర్కొన్నది. స్థానిక అధికారులతో ఈ అంశంపై చర్చిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. క్రాష్ సైట్ వద్ద దట్టమైన పొగలు వ్యాపించడంతో ఆ విమానాశ్రయంలో అన్నివిమానాలను గ్రౌండ్ చేస్తూ ఫెడరల్ ఏవియేషన్ శాఖ ఆదేశాలు ఇచ్చింది.అయితే చనిపోయిన వ్యక్తులు విమానంలో వారా లేక గ్రౌండ్‌పై ఉన్నవారు మృతిచెందారా ఇంకా తెలియదు. ప్రమాదం జరిగిన క్షణాల్లోనే రెస్క్యూ బృందం అక్కడకు చేరుకున్నట్లు అధికారులు తెలిపారు. అయిదుగురిలో ముగ్గురు తీవ్రంగా గాయపడినట్లు మియామి ఫైర్ చీఫ్ రాయిడ్ జదల్లా తెలిపారు. నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు ఈ ఘటన పట్ల దర్యాప్తు చేపట్టనున్నది. 200 మంది అగ్నిమాపక సిబ్బంది మంటల్ని ఆర్పారు. కానీ విమానం నుంచి ఫ్యూయల్ లీక్ అవుతున్నట్లు చెబుతున్నారు.

మందలపల్లి నేషనల్ హైవేపై బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో

దమ్మపేట, సెప్టెంబర్ 07 : అసెంబ్లీ లోపలికి పోనీయకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను అక్రమంగా అరెస్ట్ చేయడంపై నిరసనగా దమ్మపేట మండలంలోని మందలపల్లి నేషనల్ హైవేపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి, పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాస్తారోకో చేస్తున్న నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేసి దమ్మపేట పోలీస్ స్టేషన్ కి తరిలించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు దొడ్డా రమేష్, మండల మాజీ ఉపాధ్యక్షుడు గాజుబోయిన యేసు బాబు, సర్పంచ్ కొమరం సుశీల, ఉప సర్పంచ్ రామకృష్ణ, సీనియర్ నాయకులు రావుల శ్రీనివాసరావు, అబ్దుల్ జిన్న, వెలుగోటి మహేష్, రెడ్డిమాళ్ల నాగయ్య, యలమంచి చంద్రశేఖర్, శ్రీరాముల చక్రదరావు, నియోజకవర్గ మాజీ యూత్ కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, మాజీ కో ఆప్షన్ ఎంపీటీసీ బుడే, వార్డు సభ్యులు గొల్ల భవానికృష్ణ, రూప రాంబాబు, ఊయ్యాల లక్ష్మీనారాయణ, నాగరాజు, కాసిని శ్రీను, ఎస్సీ సెల్ నాయకులు మద్దెల పుల్లారావు, కొలికపోగు ధర్మ, బండి ప్రసాద్, తోగర్తి సురేష్, తోగర్తి వెంకటేశ్వరావు, తోలేం మల్లేశ్వరావు, పాశ్యం ప్రసాద్, బిసి నాయకులు తాళ్ల వెంకటేశ్వరావు, పాకనాటి శ్రీను, సున్నం నరేందర్, దండబత్తుల కాంతారావు, బండి ప్రసాద్ పాల్గొన్నారు.



త్రిషపై వ్యాఖ్యల నేపథ్యంలో తమిళనాడు సీఎం విజయ్ హెచ్చరిక!



చెన్నై, సెప్టెంబర్ 7: రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలపై ఎలాంటి నిందాపూర్వక, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని సహించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. ఇటీవల నటి త్రిషను ఉద్దేశించి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే వివాదం చెలరేగిన నేపథ్యంలో, విజయ్ శాసనసభలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో కఠినమైన విమర్శలు చేసుకోవడం సహజమేనని, అయితే భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని సీఎం పేర్కొన్నారు.మహిళల గౌరవమే ప్రాధాన్యం: తన సినీ కెరీర్‌లోనూ, ప్రస్తుతం రాజకీయంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంలోనూ మహిళల పాత్ర కీలకమైనదని విజయ్ గుర్తుచేశారు. ఇంట్లో తల్లులు, సోదరీమణులను ఏ విధంగా గౌరవిస్తామో, బయట కూడా అదే గౌరవాన్ని కొనసాగించాలని కోరారు.చట్టపరమైన చర్యలు తప్పవు: ఇటీవల కాలంలో తమిళనాడు రాజకీయాల్లో ద్వంద్వార్థాలు (డబుల్ మీనింగ్స్), అశ్లీల పదజాలంతో మాట్లాడే ధోరణి పెరిగిపోయిందని, మహిళలను కించపరిచేలా ఎవరు మాట్లాడినా చట్టం తన పని తాను చేసుకుపోతుందని హెచ్చరించారు.చారిత్రక అంశాల ప్రస్తావన: గతంలో ఇదే శాసనసభలో మాజీ ముఖ్యమంత్రి జయలలిత అవమానానికి గురైన ఉదంతాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి సంస్కృతిని ప్రజలు గమనిస్తున్నారని వ్యాఖ్యానించారు.కావేరీ నిరసన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవ్వగా, ఆయన ఏ నటి పేరును ప్రస్తావించలేదని డీఎంకే వర్గాలు తెలిపాయి. రాజకీయంగా లబ్ధి పొందడానికే తమ వ్యాఖ్యలను ఎడిట్ చేసి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించాయి.ఈ అంశంపై శాసనసభ సమావేశాల అనంతరం ఉదయనిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి విజయ్ డీఎంకేపై ఎలాంటి ఆధారాలు లేకుండా లేనిపోని ఆరోపణలు చేశారని విమర్శించారు. అసెంబ్లీలో సీఎం ఆరోపణలకు సమాధానం ఇచ్చేందుకు ప్రతిపక్షానికి స్పీకర్ అవకాశం ఇవ్వలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కేవలం ఆరోపణలు చేస్తే సరిపోదని, వాటిని నిరూపించాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వంపైనే ఉందన్నారు.

ఫేక్ వీడియో షేర్ చేయడంపై వివరణ ఇచ్చిన అభిజిత్ దీప్కే





న్యూఢిల్లీ:రామ జన్మభూమి ట్రస్ట్ సీఈవోను ఎక్స్ వేదికగా టార్గెట్ చేస్తూ షేర్ చేసిన వీడియోపై సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే వివరణ ఇచ్చారు. తాను షేర్ చేసిన వీడియో ఫేక్ అని తనకు ముందుగా తెలియదని వెల్లడించారు. 'నేను షేర్ చేసిన వీడియో ఫేక్ అని నాకు తెలియదు. ఏదేమైనా.. ఎవరి వ్యక్తిగత జీవితం వారిది. దానిపై నాకెటువంటి అభ్యంతరాలు లేవు' అని వ్యాఖ్యానించారు.బాబీ డియోల్ నటించిన 'జమాల్ కుడు' పాటకు డాన్స్ చేస్తున్న ఓ వ్యక్తి వీడియోను ఆదివారం అభిజిత్ ఎక్స్‌లో షేర్ చేసి, అతను రామజన్మ భూమి తీర్థ ట్రస్ట్ సీఈవో జితేంద్ర మిశ్రా అని పేర్కొన్నారు. 'వ్యక్తిగత జీవితంలో ఎవరికి నచ్చినట్టుగా వారు ఉండడం తప్పేమీ కాదు. కానీ, ధర్మాన్ని కాపాడేవాళ్లమని చెప్పుకునే వారు దీని గురించి కొంచెం ఆలోచించుకోవాలి. రామజన్మభూమి ట్రస్ట్ సీఈవో ఇలాంటివి చేయకూడదు కదా..' అని పేర్కొన్నారు.అయితే, కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుని హోదాలో ఉన్న వ్యక్తి ఓ ఫేక్ వీడియోను షేర్ చేయడమేమిటని నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. కాగా, రిటైర్డ్ ఎయిర్ మార్షల్ జితేంద్ర మిశ్రా ఇటీవలె రామజన్మభూమి ట్రస్ట్ సీఈవోగా నియమితులయ్యారు. 62 ఏళ్ల మిశ్రా ఎయిర్ ఫోర్స్ విభాగంలో సేవలు అందించి ఎన్నో మెడల్స్ సాధించారు. గత ఏడాది జరిగిన ఆపరేషన్ సిందూర్‌లో ఆయన వెస్ట్రెన్ కమాండ్‌కు సారథ్యం వహించారు.

దోచుకోవడం దాచుకోవడంపైనే కాంగ్రెస్ దృష్టి: మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

కురవి: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ 1000 రోజుల పాలనపై సీరోలులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రెడ్యానాయక్ మాట్లాడుతూ.. అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రజా సమస్యల పరిష్కారం, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టకుండా ఎలా దోచుకోవాలి? ఎలా దాచుకోవాలనే వాటిపైనే దృష్టి సారించారని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీల అమలుపై ప్రజలకు వాస్తవ పరిస్థితిని వివరించేందుకు బీఆర్ఎస్ కార్యకర్తలు అన్ని గ్రామాల్లో బాకీ కార్డులను పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏ మేరకు అమలయ్యాయో ప్రజలకు వివరించాలని సూచించారు. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాకముందు రూ. 4 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని హామీ ఇచ్చి, మోసం చేశారని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీ అమలు చేయకపోవడంతో పాటు డీఏలు కూడా ఇవ్వలేదని అన్నారు. రాష్ట్రంలో ప్రతి పనికీ 10 నుంచి 15 శాతం వరకు లంచాలు తీసుకుని పనులు చేస్తున్నారని ఆరోపించారు.డోర్నకల్ ఎమ్మెల్యేను ఉద్దేశించి తాను సీరోలు ప్రాంతాన్ని అభివృద్ధి చేసిన 'పాడి గేదె' లాంటి వాడినని, ప్రజలు మాత్రం 'దున్నపోతు' లాంటి వ్యక్తికి ఓటు వేసి గెలిపించారని వ్యాఖ్యానించారు. ప్రజలు పాలన, అభివృద్ధి, హామీల అమలును పరిశీలించి భవిష్యత్‌లో నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంపల్లి సొసైటీ మాజీ చైర్‌పర్సన్ కొండపల్లి శ్రీదేవి, కురవి మాజీ వైస్ ఎంపీపీ దొంగలి నర్సయ్య, నాయకులు బోజ్యానాయక్, పెద్ద వెంకన్న, మామిండ్ల వెంకన్న, జైపాల్‌రెడ్డి, మోహన్‌నాయక్, నరహరి, అనిల్ పాల్గొన్నారు.




ఇంజిన్ 1లో పడిపోయిన ఆయిల్ స్థాయిలు.. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం వెనక్కి, ఒక ఇంజిన్‌తో ల్యాండింగ్



తిరువనంతపురం: ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం గాలిలో ఉండగా ఒక ఇంజిన్‌లో ఆయిల్ స్థాయిలు వేగంగా పడిపోయాయి. గమనించిన పైలట్లు అప్రమత్తమయ్యారు. ఆ విమానాన్ని వెనక్కి మళ్లించారు. ఆ ఇంజిన్‌ను ఆఫ్ చేసి మరో ఇంజిన్‌తోనే ఎయిర్‌పోర్ట్‌లో సురక్షితంగా ల్యాండ్ చేశారు. అయితే పైలట్లు ఎదుర్కొన్న ఈ తీవ్ర పరిస్థితి గురించి అందులోని ప్రయాణికులకు ఏమాత్రం తెలియలేదు. ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్‌కు చెందిన బోయింగ్ 737 ఫ్లైట్ ఐఎక్స్ 415, కేరళలోని కొచ్చిన్ నుంచి యూఏఈ రాజధాని అబుదాబికి బయలుదేరింది. 50 నిమిషాల ప్రయాణం తర్వాత 36,000 అడుగుల ఎత్తులో విమానం గాలిలో ఉండగా ఇంజిన్ 1లో ఆయిల్ పరిమాణం వేగంగా పడిపోయింది. పైలట్, కో-పైలట్ దీనిని గమనించారు. ఆయిల్ స్థాయిలు ఇంకా పడిపోతుండటంతో వారు అప్రమత్తమయ్యారు. అబుదాబి మార్గాన్ని విరమించుకుని వెనక్కి మళ్లించారు. విమానం తిరిగి కొచ్చిన్‌కు మళ్లుతున్నట్లు ఏటీసీకి తెలియజేశారు.కాగా, ఆ విమానం తిరిగి వెనక్కి ప్రయాణించినప్పుడు అన్ని ప్రామాణిక భద్రతా విధానాలను పైలట్లు పాటించారు. ఇంజిన్ ఆయిల్ స్థాయిలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. విమానం వెనక్కి మళ్లిన సుమారు 45 నిమిషాల తర్వాత ఇంజిన్ 1లో ఆయిల్ ప్రెషర్ హెచ్చుతగ్గులకు గురవ్వడం ప్రారంభమైంది. కాక్‌పిట్ గేజ్‌పై రెడ్ జోన్‌లోకి ప్రవేశించింది. ఇంజిన్ 1లోని ఆయిల్ ప్రెషర్ ప్రమాదకర స్థాయికి పడిపోయినట్లు అది సూచించింది. ఈ నేపథ్యంలో పైలట్లు మరింత అలెర్ట్ అయ్యారు. నాన్ నార్మల్ చెక్‌లిస్ట్‌ను అనుసరించి ఇంజిన్ 1ను ఆపివేశారు. కేవలం ఇంజిన్ 2పై ఆధారపడి కొచ్చిన్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు.మరోవైపు అధిక బరువున్న బోయింగ్ 737 విమానాన్ని ఒకే ఇంజిన్‌తో ల్యాండింగ్ చేయడం అనేది అధిక శ్రమతో కూడుకున్న, అత్యంత ప్రమాదకరమైన విన్యాసం. అయితే ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ పైలట్లు దానిని సునాయాసంగా పూర్తి చేశారు. కాగా, కాక్‌పిట్‌లో జరిగిన ఈ తీవ్ర పరిణామం గురించి ఆ విమానంలోని ప్రయాణికులకు ఏ మాత్రం తెలియలేదు.

పీజీ హాస్టల్ బిల్డింగ్ ఓనర్ అరెస్టు .. కొనసాగుతున్న దర్యాప్తు



న్యూఢిల్లీ: సత్యా నికేతన్ బిల్డింగ్ ఓనర్ హరిరామ్ గుప్తాను ఢిల్లీ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని భివాడిలో అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే ఢిల్లీలో ఆదివారం పీజీ హాస్టల్‌కూలిన ఘటనలో పోలీసులు హరిరామ్ గుప్తాను విచారిస్తున్నారు. అయిదు అంతస్తుల బిల్డింగ్‌లో బాయ్స్ పీజీ హాస్టల్ నడిపిస్తున్నారు. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ సమీపంలో ఈ బిల్డింగ్ ఉన్నది. అయితే రిపేర్ వర్క్ జరుగుతున్న సమయంలో బిల్డింగ్ కూలింది. ఆ ఘటనలో ఏడుగురు మృతిచెందారు. ఈ ఘటనకు దారి తీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బిల్డింగ్ కండీషన్‌తో పాటు రిపేర్ వర్క్ జరిగిన తీరును కూడా విచారిస్తున్నారు.

'నాన్న, మీరు గర్వపడేలా చేస్తా'.. కొడుకు చివరి మాటలకు తండ్రి కన్నీరు!

ఢిల్లీ, సెప్టెంబర్ 07: దేశ రాజధాని ఢిల్లీలోని సత్య నికేతన్ ప్రాంతంలో నిన్న ఐదంతస్తుల భవనం కూలిన ఘటన అందరినీ తీవ్రగ్రాంతికి గురి చేసింది. ఈ దుర్ఘటనలో ఏడుగురు మృతి చెందారు. వారిలో మధ్యప్రదేశ్‌కు చెందిన అక్షత్ సింగ్ అనే విద్యార్థి ఒకరు. అతడు ఢిల్లీ విశ్వవిద్యాలయం (డీయూ) పీజీడీఏవీ కాలేజ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. కొడుకు మరణ వార్త తెలిసి మధ్యప్రదేశ్ కట్నీలో నివాసం ఉంటున్న అక్షత్ కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం ఢిల్లీకి చేరుకున్నారు. కుమారుడి మృతదేహాన్ని చూసి అక్షత్ తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదించిన తీరు అక్కడ ఉన్నవారిని కూడా కంటతడి పెట్టించింది. ఇక అక్షత్ సోదరి అయితే తమ్ముడి మృతదేహం చూసి.. స్పృహ కోల్పోయారుఅక్షత్ తండ్రి రాజస్థాన్‌లోని కోటాలో పనిచేస్తుండగా, తల్లి గృహిణి. అతడు చదువులో ముందుంటాడని, పుస్తకాలు చదవడం, క్విజ్ పోటీల్లో పాల్గొనడం అంటే అతనికి ఎంతో ఇష్టమని కుటుంబ సభ్యులు తెలిపారు. ఖాళీ సమయం దొరికితే పుస్తకాలు కొనేవాడని, సివిల్స్ పరీక్షలు రాసి ఐఏఎస్ కావాలనేది అతని కోరిక అనే అక్షత్ బంధువులు వెల్లడించారు. 'నాన్నా, భవిష్యత్ లో ఒక రోజు నేను పెద్ద ఆఫీసర్‌నై నిన్ను గర్వపడేలా చేస్తా' అని తనకు తరచూ చెప్పే వాడంటూ ఈ మాటలు గుర్తు చేసుకుని అక్షత్ తండ్రి కన్నీరుమున్నీరుగా విలపించాడు.ఈ ఘటన జరగడానికి రెండు రోజుల ముందే అక్షత్ తన తల్లితో వీడియో కాల్‌లో మాట్లాడాడు. అవే చివరి మాటలు అవుతాయని ఆ తల్లి కలలో కూడా ఊహించలేదు. 'నవమాసాలు మోసి, పెంచి పెద్దచేసిన బిడ్డ విగతజీవిగా పడివుండటం చూసి తట్టుకోలేకపోతున్నాను' అంటూ అక్షత్ తల్లి గుండెలు పగిలేలా రోధించింది. ఇటీవలే రాఖీ పండుగకు ఇంటికి వెళ్లిన అక్షత్ సోదరికి రక్షబంధన్ కట్టి తిరిగి ఢిల్లీ చేరుకున్నాడు.ఇంతలోనే భవనం కూలిన ఘటనలో విగత జీవిగా మారాడు. అక్షత్ తండ్రి ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు ఉండే ప్రాంతాల్లో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా భవనాలను ఎందుకు తనిఖీ చేయరని ఆయన ప్రశ్నించారు. అధికారుల నిర్లక్ష్యమే తన బిడ్డ ప్రాణాలను బలితీసుకుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

పాదయాత్రల కౌంటర్...



విజయవాడ, సెప్టెంబర్ 7,ఏపీ రాజకీయాలలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న తెగువ మామూలుగా లేదు. ప్రభుత్వంలో కీలక వ్యక్తిగా కొనసాగుతూనే.. ప్రతిపక్ష హోదా కూడా దక్కించుకోలేని మాజీ ముఖ్యమంత్రి జగన్ ప్లాన్లకు ఎక్కడికి అక్కడ చెక్ పెడుతున్నారు. తాజాగా జగన్ పాదయాత్ర చేస్తారని వైసిపి తెగ ప్రచారం చేస్తున్న నేపథ్యంలో.. దానికి ప్రారంభంలోనే లోకేష్ చెక్ పెట్టారు.2027 లో వాస్తవానికి ఏపీలో ఎన్నికలు జరగవు. అయితే 2027 లోనే పాదయాత్ర చేస్తానని జగన్ ఇప్పటికే ప్రకటించినట్టు తెలుస్తోంది. సరిగ్గా 2017 నవంబర్ 6న ఆయన పాదయాత్ర చేశారు. 2019లో జరిగిన ఎన్నికల్లో ఏకంగా 151 సీట్లను గెలుచుకొని.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయ్యారు. ఈసారి కూడా అదే ఫార్ములా రిపీట్ అవుతుందని జగన్ భావిస్తున్నారు. ఒకరకంగా ఎన్నికలకు రెండు సంవత్సరాల ముందుగానే జగన్ పాదయాత్రకు ప్రణాళిక రూపొందించడం విశేషం.గతంలో ఎన్నికలకు ఏడాదిన్నరకు ముందుగానే పాదయాత్ర ఫిక్స్ చేస్తే.. ఈసారి దాన్ని రెండు సంవత్సరాలకు ముందుగానే పొడిగించారు. గతంలో జగన్ 3700 కిలోమీటర్ల దాకా పాదయాత్ర చేశారు. ఈసారి ఏకంగా 5000 కిలోమీటర్లను టార్గెట్ గా పెట్టుకున్నారు. ఈసారి పూర్తిగా గ్రామాల మీదుగా వైయస్ జగన్ పాదయాత్ర సాగుతుందని వార్తలు వస్తున్నాయి. ఎన్నికలకు రెండు సంవత్సరాలు ముందుగానే అంటే దాదాపు 730 రోజులు.. ఒకవేళ మధ్యలో జగన్ విశ్రాంతి తీసుకున్న సరే రోజుకు మూడు గ్రామాలను కవర్ చేయాలని వైసిపి నేతలు డిజైన్ చేసినట్టు తెలుస్తోంది. వైసిపికి గ్రామీణ ప్రాంతాలలో ఓటు బ్యాంకు ఉందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాలలోనే అధికంగా అమలు చేసినట్టు వారు గుర్తు చేసుకుంటున్నారు. గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు.. ఇతర సమీకరణాలు తనకు అనుకూలంగా ఉంటాయని వైసీపీ నేతలు భావిస్తున్నారు.కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో ఉన్న వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని వైసీపీ నేతలు అంటున్నారు. అయితే ఇప్పుడు టిడిపి అంతకు మించిన ప్రణాళికతో ఉంది. కేవలం వైసీపీ మీద ఉన్న నెగిటివిటీని మాత్రమే కాకుండా.. అమరావతి.. రాజధాని అభివృద్ధి.. మౌలిక సదుపాయాలు.. సాగునీటి ప్రాజెక్టులు వంటి వాటిని ప్రధానంగా ప్రచారం చేసుకుంటున్నది. మెరుగైన సంక్షేమం అందిస్తున్నామని ఇప్పటికే టిడిపి వివిధ వేదికలలో వైసిపి కి చెక్ పెట్టే విధంగా ప్రచారం చేస్తోంది. వైసీపీ ప్రణాళికలకు గట్టిగానే దెబ్బకొట్టే విధంగా అడుగులు వేస్తోంది. ఒకవేళ ఇప్పుడు టిడిపి ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమానికి ఎక్కువ ఇస్తామని వైసిపి చెబితే ప్రజల్లో కొత్త సానుకూలత వచ్చే అవకాశం ఉంది. అయితే కేవలం సంక్షేమ మాత్రమే కాకుండా.. అభివృద్ధి ఎజెండాను కూడా వైసిపి చూపించాల్సి ఉంటుంది.ఏపీ రాజధాని విషయంలో వైసిపికి ఇప్పటికి ఒక క్లారిటీ లేదు. గతంలో మూడు రాజధానులు అన్నారు. ఆ తర్వాత విశాఖపట్నం అన్నారు. ఇప్పుడేమో మావిగన్ అంటున్నారు. ఒకవేళ మావిగన్ గురించి వైసిపి ఇప్పటికంటే ఎక్కువ ప్రచారం చేసినప్పటికీ.. అప్పటికే అమరావతి మొదటి దశ పూర్తవుతుంది. అలాంటప్పుడు వైసిపి మావిగన్ గురించి డప్పు కొట్టి చెప్పిన ప్రయోజనం ఉండదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఏపీలో సాగునీటి ప్రాజెక్టులను వరుసగా ప్రారంభించుకుంటూ వెళ్తోంది. అంతేకాదు, పోలవరం కూడా పూర్తి చేస్తామని చెబుతోంది. ఎన్నికల నాటికి కొన్ని కీలకమైన ప్రాజెక్టులు కూడా పూర్తవుతాయని కూటమి నేతలు అంటున్నారు. అలాంటప్పుడు జగన్ పాదయాత్ర చేస్తున్నప్పుడు ఎలాంటి విమర్శలు చేస్తారు.. క్రెడిట్ చోరీ అంటూ ఒకవేళ జగన్ విమర్శలు చేసినప్పటికీ ఉపయోగము ఉండదు.జగన్ చేస్తున్న పాదయాత్రకు కౌంటర్ గా.. ఏపీ విద్యాశాఖ మంత్రి లోకేష్ కూడా పాదయాత్ర చేస్తారని.. జగన్ పర్యటించిన ప్రాంతాలకు దగ్గరగానే లోకేష్ పాదయాత్ర కూడా సాగుతుందని కూటమినేతలంటున్నారు. జగన్ కూటమి ప్రభుత్వం మీద చేసే ప్రతి విమర్శకు లోకేష్ గట్టిగా బదులు చెబుతారని.. దీనికి సంబంధించి గట్టిగానే బ్లూ ప్రింట్ రూపొందించారని సమాచారం. సాధారణంగా ప్రతిపక్షం పాదయాత్ర చేస్తూ ఉంటుంది. కానీ ఏపీలో వైసిపికి ప్రతిపక్ష హోదా లేదు. కానీ ఇక్కడ చిత్రంగా అధికార పక్షంలో ఉన్న టిడిపి పాదయాత్ర చేసేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రకారం చూసుకుంటే 2027 లో ఏపీ రాజకీయాలలో పెను ప్రకంపనలు చెలరేగడం ఖాయం.

వడివడిగా లోకల్ బాడీ ఎన్నికల ఏర్పాట్లు

విజయవాడ, సెప్టెంబర్ 7,ఏపీ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి రంగం సిద్ధం చేసింది. ఈ నేపథ్యంలో రిజర్వేషన్లు.. ఓటర్ల జాబితా.. ఇతర వ్యవహారాలను ఎన్నికల సంఘం అధికారులు పర్యవేక్షిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలవేళ ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. అధికారులకు ఆయన కీలక ఆదేశాలు కూడా జారీ చేశారు. దీంతో చాలామందికి పదవులు రాబోతున్నాయి. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల అభిప్రాయంతో సంబంధం లేకుండా ఇష్టానుసారంగా జిల్లాలు ఏర్పాటు చేశారు. అంతటితోనే ఆగిపోయారు. శాశ్వతమైన నిర్మాణాలు.. బలమైన కార్య నిర్వాహక వ్యవస్థ.. కొత్త పదవుల భర్తీ వంటివి చేయలేకపోయారు .జగన్ చేయలేక పోయిన పనిని ఇప్పుడు చంద్రబాబు చేస్తున్నారు. ఏపీ రాష్ట్రంలో ప్రస్తుతం 13 జెడ్పీలు మాత్రమే ఉన్నాయి. వీటిని 28 చేయాలని ఇటీవల చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. చంద్రబాబు నిర్ణయం మేరకు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. జగన్ పరిపాలన కాలంలో మార్కాపురం.. పోలవరం జిల్లాలకు కూడా కూటమి ప్రభుత్వం జడ్పీలను ఏర్పాటు చేసింది. అంతేకాదు కొత్త జిల్లా పరిషత్తుల నిర్వహణ కోసం ఏకంగా 30 కీలకమైన పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం భావిస్తుంది. దీనికి తోడు అదనంగా 15 జడ్పీ సీఈవో.. 15 డిప్యూటీ సీఈవో పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. సెప్టెంబర్ 24 తో ప్రస్తుతం కొనసాగుతున్న జెడ్పి పాలకవర్గాల పదవీకాలం పూర్తవుతుంది. ఇది పూర్తి అయిన వెంటనే 28 కొత్త జడ్పీ ల వ్యవస్థ అందుబాటులోకి వస్తుంది. అంతేకాదు ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు 660 మండలాలను కొత్త జిల్లా పరిషత్ పరిధిలోకి మ్యాపింగ్ చేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.జెడ్పిల పనితీరు విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత ముందు చూపుతో ఉన్నారు. వివాదాస్పద.. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు కాకుండా కొత్త జడ్పీ లకు ప్రస్తుతం ఉన్న పారదర్శకమైన సిబ్బందిని ప్రభుత్వం సర్దుబాటు చేయనుంది. పురపాలక ఎన్నికలు పూర్తి కాకముందే జిల్లా పరిషత్ లకు సంబంధించిన పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో కొత్త జిల్లాలవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ముఖ్యమంత్రి నిర్ణయంతో పరిష్కారం కాబోతున్నాయి. ఆశావాహులకు కొత్తగా పదవులు కూడా దక్కబోతున్నాయి. స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాజకీయ ముఖచిత్రం కూడా మారనుంది.

రాజకీయాలకు అయ్యన్న గుడ్ బై...

విజయవాడ, సెప్టెంబర్ 7, ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు మొత్తానికి రాజకీయాలలో ఒక సంచలనమైన నాందికి శ్రీకారం చుట్టారు. ప్రతి విషయాన్ని కుండబద్దలు కొట్టే విధంగా చెప్పే అయ్యన్న.. చివరికి తన రాజకీయ భవితవ్యంపై కూడా కీలకమైన నిర్ణయం తీసుకున్నారు.వాస్తవానికి దేశవ్యాప్తంగా ఏ నాయకుడైనా సరే రాజకీయాలకు వచ్చిన తర్వాత.. రిటైర్మెంట్ అనేది తీసుకోకుండా ఉంటారు. చివరికి కాటికి కాలు చాపే వయసు వచ్చినప్పటికీ కూడా అధికారాన్ని వదులుకోవడానికి ఇష్టపడరు. అప్పట్లో బీహార్ రాష్ట్రంలో లాలు ప్రసాద్ యాదవ్ ఆస్పత్రిలో ఉన్నా కూడా ముఖ్యమంత్రి పదవిని వదులుకోలేదు. అవినీతి అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటూ జైలుకు వెళ్లినప్పటికీ కూడా.. తన భార్యను ముఖ్యమంత్రిని చేసి.. రాజకీయాలలో ఫ్యామిలీ ప్యాకేజీ వ్యవహారం ఎలా ఉంటుందో ఆయన నిరూపించారు.కేవలం లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రమే కాదు మన తెలుగు నాటకూడా ఈ తరహా రాజకీయ నాయకులకు కొదవలేదు. అయితే అటువంటి సాంప్రదాయం కొనసాగుతున్న నేపథ్యంలో ఏపీ శాసనసభ అధిపతి అయ్యన్నపాత్రుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. 2029లో ఏపీ రాష్ట్రంలో ఎన్నికలు జరగబోతున్నాయి. అప్పటికి అయ్యన్నపాత్రుడికి 73 సంవత్సరాలు వస్తాయి. కాబట్టి తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అంతేకాదు.. అప్పటికి ఒకవేళ తాను రాజకీయాలలో కనుక ఉండి ఉంటే.. తినడం కష్టమవుతుందని పేర్కొన్నారు.అయ్యన్న తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా టిడిపిలో చాలామంది సీనియర్లు ఆందోళన చెందుతున్నారు. ఎందుకంటే యువకులకు ఎక్కువగా అవకాశాలు ఇవ్వాలని టిడిపి భావిస్తోంది. ఈ నేపథ్యంలో అయ్యన్నపాత్రుడు తనకు 73 సంవత్సరాల వయసు వస్తుంది కాబట్టి అప్పటికి తాను రాజకీయాల్లోకి ఉండడం కరెక్ట్ కాదని ఆయన భావిస్తున్నారు.



కులాల చుట్టే పొలరైజేషన్...

కాకినాడ, సెప్టెంబర్ 7,ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను పరిశీలిస్తే కుల సమీకరణాలు ఇప్పటికీ కీలక పాత్ర పోషిస్తున్నాయనే అభిప్రాయం ఉంది. అయితే గతంతో పోలిస్తే ఇప్పుడు ఈ ప్రభావం మరో రూపంలో కనిపిస్తోంది. ముఖ్యంగా యువతలో రాజకీయ ఆసక్తి పెరగడం ఒకవైపు సానుకూల పరిణామంగా కనిపిస్తున్నప్పటికీ, సామాజిక వర్గాల ఆధారంగా వారు విడిపోతున్న తీరు మాత్రం చర్చకు దారితీస్తోంది.గతంలో కులం, రాజకీయాల విషయంలో పెద్దల మధ్య ఎక్కువగా చర్చలు జరిగేవి. యువత మాత్రం వాటికి కొంత దూరంగా ఉండేది. తమ చదువు, ఉద్యోగం, వ్యక్తిగత భవిష్యత్తుపైనే ఎక్కువగా దృష్టి పెట్టేది. కానీ సామాజిక మాధ్యమాలు విస్తరించిన తర్వాత పరిస్థితిలో మార్పు వచ్చింది. రాజకీయ నాయకుల ప్రసంగాలు, అభిమాన సంఘాల కార్యక్రమాలు, సోషల్ మీడియా పోస్టులు నేరుగా యువతను ప్రభావితం చేస్తున్నాయి. దీంతో తమకు నచ్చిన పార్టీ లేదా నాయకుడి పట్ల కొందరు యువకులు తీవ్ర అభిమానాన్ని ప్రదర్శిస్తున్నారు.రాజకీయ చైతన్యం పెరగడం ప్రజాస్వామ్యానికి మంచిదే. యువత విధానాలను ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరుపై చర్చించడం, తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయడం ఆరోగ్యకరమైన పరిణామాలే. కానీ రాజకీయ అభిమానం సామాజిక వర్గ గుర్తింపుతో కలిసిపోయినప్పుడు పరిస్థితి మరో విధంగా మారే అవకాశం ఉంటుంది. ఒక నాయకుడిని ఆయన విధానాల కోసం కాకుండా తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా మాత్రమే చూడటం రాజకీయ చర్చను సంకుచితం చేస్తుంది.ఇటీవల ఒక ప్రముఖ రాజకీయ నాయకుడి జన్మదిన వేడుకల సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో యువత పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహించడం ఈ చర్చకు మరింత బలం ఇచ్చింది. బైక్ ర్యాలీలు, భారీ సంబరాలు, ప్రత్యేక కార్యక్రమాలతో అభిమానాన్ని చాటుకున్నారు. చదువుకునే ప్రదేశాలు, పనిచేసే చోట్ల కూడా ఒకే సామాజిక నేపథ్యానికి చెందిన వారు సమూహంగా ఏర్పడి వేడుకలు నిర్వహించిన సందర్భాలు కనిపించాయి. సహజమైన అభిమానాన్ని మించి భావోద్వేగం కనిపించడం రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షించింది.ఒక నాయకుడిపై అభిమానం ఉండటం తప్పు కాదు. అదే అభిమానం ఇతర పార్టీలను లేదా సామాజిక వర్గాలను తక్కువగా చూడటానికి దారితీయకూడదు. సోషల్ మీడియాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసిన వారిపై దూషణలు చేయడం, రాజకీయ ప్రత్యర్థులను శత్రువులుగా భావించడం వంటి ధోరణులు యువతలో పెరగడం మాత్రం ఆందోళన కలిగించే అంశమే. ప్రజాస్వామ్యంలో అభిప్రాయ భేదాలు సహజం. వాటిని గౌరవించడం కూడా రాజకీయ సంస్కృతిలో భాగమే.ఇక యువత ఒక నిర్దిష్ట సామాజిక వర్గం చుట్టూ రాజకీయంగా సమీకృతమైతే భవిష్యత్ ఎన్నికల్లో దాని ప్రభావం ఎలా ఉంటుంది అనేది ఆసక్తికరంగా మారింది. రాజకీయ పార్టీలు కూడా యువత మద్దతును తమకు అనుకూలంగా మార్చుకునేందుకు ప్రయత్నించే అవకాశం ఉంది. అయితే యువతను కులం, ప్రాంతం లేదా వ్యక్తిగత అభిమానాలకు పరిమితం చేయకుండా విధానాలు, అభివృద్ధి, ఉపాధి, విద్య వంటి అంశాలపై ఆలోచించేలా చేయడం అవసరం. అప్పుడే యువ రాజకీయ చైతన్యం సమాజానికి బలంగా మారుతుంది.

పవన్ వరుస గైర్హాజర్లు... కారణం ఏమిటీ

ఒంగోలు, సెప్టెంబర్ 7, కూటమి ప్రభుత్వంలో జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తరచూ కేబినెట్ సమావేశాలకు దూరంగా ఉండటం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజాగా గురువారం జరిగిన మంత్రివర్గ భేటీకి కూడా ఆయన హాజరు కాలేదు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ కేరళ లో ప్రకృతి ఆయుర్వేద చికిత్స తీసుకుంటున్న నేపథ్యంలో ఈ గైర్హాజరుకు ప్రధాన కారణం ఆరోగ్య సమస్యలేనని తెలుస్తోంది. అయితే గతంలో కూడా కొన్ని సమావేశాలకు ఆయన రాకపోవడం, మరికొన్ని సందర్భాల్లో సమావేశానికి హాజరై అనారోగ్య కారణాలతో మధ్యలోనే వెళ్లిపోవడం జరిగింది.టీడీపీ -జనసేన -బీజేపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు సుమారు 50 వరకు కేబినెట్ సమావేశాలు జరిగాయని, వాటిలో పవన్ కొన్ని సమావేశాలకు గైర్హాజరయ్యారని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ముఖ్యంగా ఈ ఏడాది జనవరి నుంచి సెప్టెంబర్ 3 వరకు దాదాపు 15 మంత్రివర్గ సమావేశాలు జరిగితే, వాటిలో చాలా తక్కువ సమావేశాలకే ఆయన హాజరయ్యారని ప్రచారం జరుగుతోంది. సుమారు 11 భేటీలకు ఆయన దూరంగా ఉన్నారని కొన్ని వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే ఈ సంఖ్యకు సంబంధించి అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.పవన్ కళ్యాణ్‌కు ఇటీవల ఆరోగ్యపరమైన ఇబ్బందులు ఉండటం కూడా ఈ పరిణామాలకు కారణంగా కనిపిస్తోంది. కొంతకాలం క్రితం ముంబై లోని ఆసుపత్రిలో ఆయన భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ తర్వాత కూడా నొప్పి పూర్తిగా తగ్గకపోవడంతో విశ్రాంతి, చికిత్స కోసం కేరళకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కేబినెట్ సమావేశాలకు హాజరు కాకపోవడాన్ని సహజంగానే చూడాలని కూటమి వర్గాలు భావిస్తున్నాయి.అయితే రాజకీయంగా మాత్రం ఈ అంశంపై భిన్నమైన చర్చలు మొదలయ్యాయి. పవన్ గైర్హాజరు పూర్తిగా ఆరోగ్య కారణాల వల్లేనా? లేక ఇందులో రాజకీయ కోణం కూడా ఉందా? అనే సందేహాలను కొందరు విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులకు కూడా పవన్ గతంలో క్రమం తప్పకుండా హాజరయ్యేవారని, ఇటీవల మాత్రం ఆయన పాల్గొనడం తగ్గిందని రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది.ఒక కేబినెట్‌లో కీలకమైన శాఖను నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి వరుసగా సమావేశాలకు దూరంగా ఉండటం సాధారణ విషయం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా పవన్ కళ్యాణ్ కేవలం మంత్రి మాత్రమే కాకుండా ఒక రాజకీయ పార్టీకి అధినేత కావడంతో ఆయన గైర్హాజరుపై సహజంగానే ఎక్కువ దృష్టి పడుతోంది. అయితే ప్రస్తుతం ఆయన ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకుని కూటమి నాయకత్వం దీనిని సానుకూలంగానే చూస్తున్నట్లు తెలుస్తోంది.పవన్ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడి సెప్టెంబర్ 10న కేరళ నుంచి తిరిగి వస్తారని సమాచారం. ఈ నెలలోనే మరో కేబినెట్ సమావేశం జరగనున్న నేపథ్యంలో ఆయన అందులో పాల్గొంటారా లేదా అనే ఆసక్తి రాజకీయ వర్గాల్లో నెలకొంది. ఆయన తిరిగి చురుకుగా ప్రభుత్వ కార్యకలాపాల్లో పాల్గొంటే ఈ గైర్హాజరుపై కొనసాగుతున్న రాజకీయ చర్చలకు కూడా కొంతవరకు తెరపడే అవకాశం ఉంది.

వ్యవసాయ కూలి నుంచి లేడీ డాన్ వరకు..

తిరుపతి, సెప్టెంబర్ 7, చిన్న గదిలో ఉంటూ.. వ్యవసాయ కూలీగా జీవితం మొదలుపెట్టిన ఓ మహిళ మాజీ మంత్రి కీలక అనుచరుడి సాయంతో లేడీ డాన్‌గా ఎదిగింది. ఆమె మదలనపల్లెకు చెందిన కోనేటి సులోచన. స్థానికంగా 'లేడీ డాన్'గా చలామణి అవుతూ అనేక అక్రమాలకు పాల్పడింది. శనివారం కోనేటి సులోచన ఇంట్లో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. మాజీ మంత్రి ముఖ్య అనుచరుడితో చేతులు కలిపి వందల కోట్ల విలువైన భూములను అక్రమంగా కాజేసిన వ్యవహారం వెలుగులోకి రావడంతో.. కోర్టు ఆదేశాలతో తనిఖీలు నిర్వహించారు. మదనపల్లె డీఎస్పీ బుచ్చిరాజు ఆధ్వర్యంలో సీఐలు మోహన్ కుమార్, రాజారెడ్డి, మహమ్మద్ రఫీలతో కూడిన మూడు టీమ్‌లు నిర్వహించాయి. సులోచన నివాసంతో పాటు ఆమె సోదరుడు శ్రీనివాసులు ఇంట్లో తనిఖీలు చేశారు. పోలీసులు తనిఖీల్లో 50 రకాల కీలక ఆస్తి డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. వీటిల్లో 15 ఫోర్జరీ సంతకాలు చేసి ఉంచిన పాత ఖాళీ బాండు పేపర్లు బయటపడ్డాయి. అప్పులు ఇచ్చినట్లు నమ్మించి, వారి నుంచి బలవంతంగా ఖాళీ బాండ్లపై సంతకాలు తీసుకుని ఆస్తులు లాక్కోవడానికి వీటిని ఉపయోగించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ పత్రాలను ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీకి పంపినట్లు డీఎస్పీ తెలిపారు. సులోచన పేరుపై బండకమ్మమీదపల్లెలో రూ.60 కోట్ల విలువైన 502 చదరపు గజాల స్థలం, బిల్డింగ్, పొన్నూటిపాళ్యంలో 1.75 ఎకరాల భూమి ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఫోర్జరీ పవర్ ఆఫ్ అటార్నీ దస్తావేజును ఉపయోగించి 10 కోట్ల విలువైన 47 సెంట్ల భూమిని ఆక్రమించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ భూమిని మాజీ మంత్రి భార్య పేరిట 2023 జూన్‌లో గిఫ్ట్‌డీడ్‌గా మార్చినట్లు గుర్తించారు. గతంలో కోట్ల విలువైన భూములను అక్రమంగా రాయించుకున్నారని బాధితులుచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మదనపల్లె లేడీ డాన్ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే పోలీసుల తనిఖీలు చేస్తున్న క్రమంలో సులోచన ఇంట్లో లేదు. ఆమె విజయవాడలో ఉన్నట్లు గుర్తించారు. సులోచన ఇంట్లో స్వాధీనం చేసుకున్న పత్రాల వివరాలను ఇంట్లో ఉన్న ఆమె పిల్లలకు అందజేశారు. బాధితుడు మార్పు వెంకటేష్ నాయుడు ఇచ్చిన ఫిర్యాదుతో కోర్టు ఆదేశాలతో పోలీసులు తనిఖీలు నిర్వహించినట్లు సమాచారం. లేడీడాన్ సులోచనపై మదనపల్లె ఒకటో, రెండో పట్టణ, పోలీసు స్టేషన్లలో 14 క్రిమినల్ కేసులు, రౌడీషీట్ ఉండడం గమనార్హం.

స్వదేశ్ దర్శన్ పేరుతో బుద్ధిస్ట్ ఎక్స్ పీరియన్స్

శ్రీకాకుళం సెప్టెంబర్ 7,స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్ధిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు. భవిష్యత్‌లో అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలు, గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు, నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ అభివృద్ధి చేయనున్నారు.ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రకృతి అందాలను బయట ప్రపంచానికి చూయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. టూరిస్ట్ ప్లేస్‌లుగా పేరొందిన కొన్ని ప్రదేశాలను మరింత అందంగా మార్చేందుకు భారీగా నిధులు వెచ్చిస్తున్నారు. స్వదేశ్ దర్శన్ 2.0, ప్రసాద్ పథకాల కింద మొత్తం రూ. 419.30 కోట్లతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది.అరకు, అరసవల్లి, గన్నవరం, వేదిగిరి ప్రాంతాల అభివృద్ధికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిన టెండర్లకు కూడా ఆహ్వానించింది. స్వదేశ్ దర్శన్ పథకంలో రూ. 152 కోట్లతో ఇప్పటికే అరకు గుహలు, సూర్యలంక బీచ్ అభివృద్ధి చేయడంతో పాటు నాగార్జునసాగర్ వద్ద బుద్ధిస్ట్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ కూడా నిర్మిస్తున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో రూ. 101.07 కోట్లతో అరకు కల్చరల్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. కొత్తవలసలో ఐటీడీఏకు చెందిన 19.23 ఎకరాల స్థలంలో దీన్ని అభివృద్ధి చేయనున్నారు. గిరిజన సంస్కృతి, స్థానిక వంటకాలు, అరకు కాఫీ, చిరు ధాన్యాల ప్రత్యేకతలను పర్యాటకులకు పరిచయం చేయనున్నారు.శ్రీకాకుళం జిల్లాలో ప్రసిద్ధి చెందిన అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయ పరిసరాలను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రూ. 107.94 కోట్లతో అరసవల్లి సన్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నాగావళి నది ఒడ్డున చారిత్రక దచ్ హెరిటేజ్ భవనాన్ని పునరుద్ధరించి వినియోగంలోకి తీసుకురానున్నారు.గన్నవరం ఎయిర్‌పోర్ట్‌కు కిలోమీటర్ దూరం సుమారు ఐదెకరాల విస్తీర్ణంలో రూ. 176 కోట్లతో గన్నవరం మైస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు. నెల్లూరు జిల్లాలో వేదగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని రూ. 34.29 కోట్లతో ప్రసాద్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారు. వీటితో పాటు స్వదేశ్ దర్శన్ 2.0లో మరికొన్ని ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. మచిలీపట్నంలో కోస్ట్ ఎక్స్‌పీరియన్స్, మంగళగిరి ఆలయ పరిసరాల్లో పర్యాటక సదుపాయాలు, మంగళగిరి ఎకో పార్క్ అభివృద్ధి, నంద్యాల జిల్లాలో బెలూం గుహల్లో కేవ్ లైటింగ్ వంటి సదుపాయాల కల్పన ఉన్నాయి.

తిరుపతిలో ట్రావెల్స్ మేనేజర్ పై రౌడీ షీటర్ దాడి

తిరుపతితిరుపతి లో ఒక ట్రావెల్స్ మేనేజర్ పై రౌడీ షీటర్ దాడికి దిగారు. బాధితుడి ఫోన్ పగలగొట్టి, మెడలో గోల్డ్ చైన్ లాక్కొని చంపేస్తానంటూ బెదిరింపులకు గురి చేసారు. చెర్లోపల్లి ఆయన్ డిజిటల్ ఎగ్జామినేషన్ సెంటర్ సమీపంలో ఘటన జరిగింది. సుండుపల్లి మండలం మంచిరెడ్డిపల్లికి చెందిన చంద్రమోహన్ పుదీపట్ల కృష్ణ ట్రావెల్స్ లో మేనేజర్ . ఈనెల 4న రోడ్డుపై ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న వారికి హారన్ కొట్టాడని అడ్డగించి దాడికి దిగారు. నా పేరు అజీమ్, నేను రౌడీషీటర్, మిమ్మల్ని చంపేస్తా అంటూ దాడి చేసి మెడలోని 9 గ్రాముల బంగారు చైను లాక్కున్నాడు. బాధితుడు పి.చంద్రమోహన్ తిరుపతి రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసాడు. కొర్లగుంట కొత్తపల్లికి చెందిన రౌడీ షీటర్ సయ్యద్ అజీమ్, తిరుపతి రూరల్ అవిలాలకు చెందిన గోశాల రుద్ర ను పోలీసులు అరెస్టు చేసారు. వినయ్ అలియాస్ బబ్లు కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

స్పోర్ట్స్ గ్యాలరీ

భారత్-జపాన్ స్పెషల్ టీ20 మ్యాచ్.. యూట్యూబ్‌లో ప్రసారం?



భారత క్రికెట్ చరిత్రలోనే తొలిసారిగా టీమిండియా జపాన్‌తో టీ20 మ్యాచ్ ఆడనుంది. ఇరు దేశాల దౌత్య సంబంధాల 75వ వార్షికోత్సవ సంబరాల ప్రారంభ సూచికగా ఈ ప్రతిష్టాత్మక మ్యాచ్ నిర్వహించనున్నారు. శానో ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా సెప్టెంబర్ 22న ఈ చారిత్రక మ్యాచ్ జరగనుంది. అయితే ఆసియా క్రీడలు 2026కు రెండు రోజుల ముందే ఈ మ్యాచ్ ఉండటంతో ప్రసార హక్కుల విషయంలో గందరగోళం నెలకొందిమ్యాచ్ ప్రసార హక్కుల కోసం ఐటీడబ్ల్యూ యూనివర్స్‌తో జపాన్ క్రికెట్ అసోసియేషన్(జేసీఏ) చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఆసియా గేమ్స్‌కు కేవలం రెండు రోజుల ముందు ఈ మ్యాచ్ జరగనుండటంతో ప్రసార సంస్థలకు లాజిస్టిక్స్ సమస్యగా మారినట్లు తెలుస్తోంది. టీవీ ప్రసార ఒప్పందం కూడా ఇంకా ఖరారు కాలేదు. దీంతో మ్యాచ్‌ను యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసే అవకాశాలున్నట్లు సమాచారం. భారత్‌లో మ్యాచ్ ప్రసార వ్యవహారాల్లో ఫ్యాన్‌కోడ్ కూడా ఉన్నట్లు తెలుస్తోంది. జపాన్ క్రికెట్ అసోసియేషన్‌తో గతంలోనూ ఫ్యాన్‌కోడ్ కలిసి పనిచేసింది. మరోవైపు ఐటీడబ్ల్యూ యూనివర్స్ స్టార్, సోనీ, జీ సంస్థలతో ప్రసార భాగస్వామ్యం కోసం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం.ఇదిలా ఉంటే, ఆసియా గేమ్స్‌లో మహిళల క్రికెట్ ఫైనల్ మ్యాచ్ కూడా అదే రోజు ఉంది. ఇందులో టీమిండియానే 'గోల్డ్ మెడల్' ఫేవరే?ట్‌గా భావిస్తున్నారు. ఆ మ్యాచ్ ముగిసిన రెండు గంటల్లోనే భారత్-జపాన్ పోరు జరగనుంది. దీంతో ఒకే రోజు రెండు మ్యాచ్‌లు ప్రసారం చేయడం జపాన్ బ్రాడ్‌కాస్టర్లకు తలనొప్పిగా మారింది. జపాన్‌తో మ్యాచ్‌కు రెండు రోజుల ముందు టీమిండియా శానోలో ప్రాక్టీస్ సెషన్ కూడా నిర్వహించనుండటం గమనార్హం.

దులీప్ ట్రోఫీ ఫైనల్: విధ్వంసం.. ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ

దులీప్ ట్రోఫీ ఫైనల్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ విధ్వంసం సృష్టించాడు. సౌత్ జోన్‌పై మ్యాచ్‌లో ద్విశతకంతో చెలరేగాడు. 301 బంతుల్లో 27 ఫోర్లు, 7 సిక్సర్ల సాయంతో 250 పరుగులు చేశాడు. నిరంతరాయంగా బ్యాటింగ్ చేస్తున్న కారణంగా రెండో రోజు కాస్త అసౌకర్యానికి గురై రిటైర్డ్ హర్ట్‌గా పెవిలియన్ చేరాడు. ప్రస్తుతం 131 ఓవర్లకు ఈస్ట్ జోన్ స్కోర్ 614/5.ఓవర్ నైట్ 385/4 స్కోరుతో ఈస్ట్ జోన్ రెండో రోజు ఆటను ప్రారంభించింది. కుమార్ కుషాగ్రా (101) సెంచరీ చేసి ఔటయ్యాడు. ఇషాన్-కుషాగ్రా కలిసి ఐదో వికెట్‌కు 230 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. అనంతరం క్రీజులోకి వచ్చిన అనుకుల్ రాయ్(41×) ఇషాన్‌తో అద్భుతంగా ఇన్నింగ్స్‌ను నడిపించాడు. వీరిద్దరూ కలిసి 140 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఇషాన్ రిటైర్డ్ హర్ట్ అవ్వడంతో క్రీజులోకి కురేషి(6×) వచ్చాడు. ఇదిలా ఉంటే, సౌత్ జోన్ బౌలర్లలో త్రిపురణ విజయ్, సీవీ మిలింద్ తలో రెండు వికెట్లు పడగొట్టారు.




ఇషాన్ కిషన్ 250.. కుశాగ్రా 101.. ఈస్ట్ జోన్ సూపర్ షో



చెన్నై: దులీప్ ట్రోఫీ ఫైనల్లో ఈస్ట్ జోన్ కెప్టెన్ ఇషాన్ కిషన్ దుమ్మురేపాడు. సౌత్ జోన్‌తో జరుగుతున్న తొలి ఇన్నింగ్స్‌లో స్టార్ బ్యాటర్ 250 రన్స్ చేసి రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. ఇషాన్ కిషన్ 301 బంతులు ఆడి 27 ఫోర్లు, ఏడు సిక్సర్లు కొట్టాడు. రెండో రోజ బ్యాటింగ్ కొనసాగిస్తున్న ఈస్ట్ జోన్.. తాజా సమాచారం ప్రకారం 134 ఓవర్లలో అయిదు వికెట్ల నష్టానికి 61326 పరుగలు చేసింది. తొలి రోజు 111 పరుగులు చేసిన కెప్టెన్ ఇషాన్.. అదే ఊపులో రెండో రోజు కూడా బ్యాటింగ్ కొనసాగించాడు. కుమార్ కుశాగ్రాతో కలిసి కిషన్ భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. ఆ ఇద్దరూ అయిదో వికెట్‌కు 230 రన్స్ జోడించారు. కుశాగ్రా సెంచరీతో కదం తొక్కాడు. 132 బంతుల్లో 8 ఫోర్లు, అయిదు సిక్సర్లతో అతను 101 రన్స్ చేసి ఔటయ్యాడు.

'నా వారసత్వాన్ని అందుకునే సత్తా ఈ తరం బాక్సర్లలో లేదు'.. బిగ్‌బాస్ 20 లోకి మేరీకోమ్ ఎంట్రీ..!

భారత బాక్సింగ్ దిగ్గజం , ఆరుసార్లు ప్రపంచ ఛాంపియన్ మేరీ కోమ్ క్రీడా రంగం నుంచి వినోద రంగంలోకి ప్రవేశించారు. ప్రముఖ రియాలిటీ షో 'బిగ్‌బాస్ 20 (ఖతిణ ఖనీబఖ 20)' లో కంటెస్టెంట్‌గా ప్రవేశించిన ఆమె.. ఈ సందర్భంగా భారత బాక్సింగ్ భవిష్యత్తుపై కీలక వ్యాఖ్యలు చేశారు. తన తర్వాత మరో 'మేరీ కోమ్' రావడం అసాధ్యమని, తన వారసత్వాన్ని అందుకునే సత్తా ప్రస్తుత తరం బాక్సర్లలో కనిపించడం లేదని ఆమె వ్యాఖ్యానించారు.మేరీ కోమ్ మాట్లాడుతూ.. 'నా తర్వాత మరో మేరీ కోమ్ ఎవరని అడిగితే నా సమాధానం 'ఎవరూ లేరు' అనేనని మేరీకోమ్ స్పష్టంచేశారు. దీనికిగల కారణాలను వివరిస్తూ.. ఇప్పటి యువ బాక్సర్లలో క్రమశిక్షణ, నిలకడ లోపించాయని అన్నారు. "చాలా మంది బాక్సర్లు ఉన్నారు. వారు ఒకట్రెండు సార్లు గెలుస్తున్నారు. కానీ ఎన్నిసార్లు..? ఒక విజయం సరిపోతుందా..? రెండు విజయాలు చాలనా..? నిలకడగా విజయాలు సాధించడంలో విఫలమవుతున్నారు. ఆ నిలకడ ఒక్క మేరీ కోమ్‌కు మాత్రమే ఉంది" అని ఆమె అన్నారు.'యువ బాక్సర్లు ఒక విజయం సాధించగానే వారికి పేరు, ప్రఖ్యాతులు, డబ్బు అన్నీ ఒకేసారి వస్తాయి. దాంతో వారిలో గెలువాలన్న ఆకలి చచ్చిపోతోంది. సంతృప్తి పడిపోతున్నారు. ఆ తర్వాత వారి ప్రస్థానం అక్కడితో ఆగిపోతోంది. అందుకే మరో మేరీ కోమ్ వస్తారని నేను చెప్పలేను' అని ఆమె అన్నారు. తన సుదీర్ఘ కెరీర్‌లో 50కి పైగా అంతర్జాతీయ మ్యాచ్‌లు గెలిచి, లండన్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన మేరీ కోమ్.. నిలకడైన ప్రదర్శనకే తాను అధిక ప్రాధాన్యత ఇస్తానని పరోక్షంగా తెలిపారు.అదే సమయంలో ఈశాన్య రాష్ట్రాల నుంచి వస్తున్న యువ ప్రతిభావంతులపై మేరీ కోమ్ ప్రశంసలు కురిపించారు. ముఖ్యంగా తన సొంత రాష్ట్రం మణిపూర్‌కు చెందిన జడుమణి సింగ్, అసోంకు చెందిన లవ్లినా బోర్గోహైన్ అద్భుతంగా రాణిస్తున్నారని కొనియాడారు.



"రాబోయే ఆసియా క్రీడలు, ఒలింపిక్స్‌లో వారు కూడా సత్తా చాటాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ఈశాన్య రాష్ట్రాల్లో అద్భుతమైన ప్రతిభ ఉంది" అని ఆమె పేర్కొన్నారు.ఇంతటి ఘనమైన క్రీడా జీవితం ఉన్నప్పటికీ 'బిగ్‌బాస్' షోలో ఎందుకు పాల్గొంటున్నారని అడగ్గా.. అది పూర్తిగా తన వ్యక్తిగత నిర్ణయమని మేరీ కోమ్ తెలిపారు. "ఇది ఒక పెద్ద వేదిక. అక్కడికి వెళ్లి, కొత్త విషయాలు తెలుసుకోవాలని, విభిన్న మనస్తత్వాలున్న మనుషులతో ఎలా మెలగాలో, ఎలా సంభాషించాలో నేర్చుకోవాలని అనుకుంటున్నాను" అని ఆమె తన ఉద్దేశాన్ని వివరించారు. ఆమె జీవితం ఆధారంగా 2014లో ప్రియాంక చోప్రా ప్రధాన పాత్రలో 'మేరీ కోమ్' బయోపిక్ వచ్చింది.

దులీప్ ట్రోఫీ ఫైనల్లో డబుల్ సెంచరీ.. అయిదో బ్యాటర్‌గా ఇషాన్ కిషన్ రికార్డు



చెన్నై : ఈస్ట్ జోన్ బ్యాటర్ , కెప్టెన్ ఇషాన్ కిషన్ చరిత్ర సృష్టించాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో డబుల్ సెంచరీ సాధించిన అయిదో బ్యాటర్‌గా రికార్డు క్రియేట్ చేశాడు. సౌత్ జోన్‌తో చెన్నైలో జరుగుతున్న మ్యాచ్‌లో.. ఇవాళ ఇషాన్ కిషన్ డబుల్ సెంచరీ చేశాడు. 250 రన్స్ చేసి అతను రిటైర్డ్ హర్ట్ అయ్యాడు. బలహీనంగా ఉన్న సౌత్ జోన్ బౌలింగ్ బృందాన్ని ఆటపట్టించాడు ఇషాన్. బౌండరీలతో హోరెత్తించాడు. అతని ఇన్నింగ్స్‌లో 27 ఫోర్లు, ఏడు సిక్సర్లు ఉన్నాయి. ఇషాన్ కిషన్‌కు ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇదే మొదటి డబుల్ సెంచరీ కావడం కూడా విశేషం. డబుల్ సెంచరీతో ఇషాన ఎలైట్ లిస్టులో చేరాడు. దులీప్ ట్రోఫీ ఫైనల్లో డబుల్ సెంచరీ సాధించిన బ్యాటర్లలో రమన్ లాంబా, అన్షుమన్ గైక్వాడ్, చతేశ్వర్ పూజారా, యశ్వంత్ జైస్వాల్ ఉన్నారు. 1987-88 సీజన్‌లో వెస్ట్ జోన్‌పై రమన్ లాంబా 320 స్కోర్ చేశాడు. 1987-88లో నార్త్ జోన్‌పై 216 స్కోరు చేశాడు గైక్వాగ్. ఇక 2016-17లో చతేశ్వర్ పూజారా 256 చేశాడు. జైస్వాల్ 2022-23లో సౌత్ జోన్‌పై 209 రన్స్ చేశాడు.

పాకిస్థాన్ క్రికెట్‌లో ఫిక్సింగ్ దుమారం.. అంతర్గత విచారణ షురూ..!



పాకిస్థాన్ క్రికెట్‌లో మరో దుమారం రేగింది. లార్డ్స్ టెస్టులో ఘోర పరాజయం, ఆపై ఏడుగురు ఆటగాళ్లపై వేటు.. తదనంతర పరిణామాలతో ఇప్పటికే అప్రతిష్టపాలైన పాక్ జట్టుపై ఫిక్సింగ ఆరోపణలు వస్తున్నాయి. లార్డ్స్‌లో ఓటమికి క్రికెటర్ల వైఫల్యంతో పాటు? ఫిక్సింగ్ కోణం కూడా ఉందని మీడియాలో కథనాలు వ్యాపిస్తున్నాయి. దాంతో, పాక్ బోర్డు సత్వరమే విచారణకు ఆదేశించింది. ఆటగాళ్లపై క్రమశిక్షణపరంగా.. అంతర్గత విచారణ జరుపుతున్నామని సోమవారం పీసీబీ మీడియా ప్రతినిధి వెల్లడించాడు.ఇంగ్లండ్ పర్యటనలో చెత్త ప్రదర్శనతో సిరీస్ కోల్పోయిన పాకిస్థాన్ జట్టు ఇప్పుడు ఫిక్సి?ంగ్ ఆరోపణలు ఎదుర్కొంటోంది. లార్డ్స్ టెస్టు ఓటమి అనంతరం ఏడుగురు ఆటగాళ్లు, ఇద్దరు కోచ్‌లను స్వదేశం పంపిన పాక్ బోర్డు అంతర్గత విచారణకు ఆదేశించింది. క్రికెటర్లపై క్రమశిక్షణ పరమైన విచారణ జరుగుతోందని పీసీబీ మీడియా ప్రతినిధి అమిర్ మిర్ వెల్లడించాడు.'ఆటగాళ్ల క్రమశిక్షణపై మీడియాలో వస్తున్న కథనాలను కూడా పరిగణనలోకి తీసుకొని విచారణ చేస్తున్నట్టు ఆయన తెలిపాడు. ఇంగ్లండ్ పర్యటనలో పాక్ ఆటాగాళ్ల క్రమశిక్షణ, ప్రవర్తన గురించి మీడియాలో కథనాలు రావడంతో విచారణకు ఆదేశించాం. ఈ విషయాలను అంతర్గతంగా సమీక్షిస్తాం. పీసీబీ ప్రమాణాలు, నియమనిబంధనల మేరకు విచారణ కొనసాగుతుంది. ఈ పరిస్థితుల్లో సోషల్ మీడియాలో వచ్చే వార్తలు, కథనాలను విశ్వసించవద్దని కోరుతున్నాం. ప్రస్తుతానికైతే పీసీబీ ఈ వ్యవహారంపై ఏ కామెంట్ చేయదలచుకోలేదు. అభిమానులు, వాటాదారులు అందరూ పీసీబీ నుంచి అధికారికంగా వచ్చే సమాచారాన్ని మాత్రమే నమ్మాలి' అని అమిర్ మిర్ పేర్కొన్నాడు.లార్డ్స్ టెస్టులో ఓటమి అనంతరం రిజ్వాన్, ఇమామ్ ఉల్ హక్, సల్మాన్ అఘా, అలీ ఉస్మాన్, అమిర్ జమాల్, అవైస్ జఫర్, ఖుర్రం షెహజాద్.. ఈ ఏడుగురిని స్క్వాడ్ నుంచి తప్పించింది పాక్ బోర్డు. సయీం అయూబ్‌తో పాటు ఐదుగురు అన్‌క్యాప్డ్ ప్లేయర్లు అరాఫత్ మిన్హాస్, మొహమ్మద్ ఇమ్రాన్, సాద్ బైగ్, ఇమ్రాన్ రంధవా, రజుల్లాహ్‌లు చివరి టెస్టుకోసం స్క్వాడ్‌తో కలువనున్నారు. నామమాత్రమైన మూడో టెస్టు సెప్టెంబర్ 9న బర్మింగ్‌హామ్‌లో జరుగనుంది.

భారత్‌పై సాధించిన ఆ విజయమే మా పతనానికి కారణం: పాక్ మాజీ కెప్టెన్

పాకిస్థాన్ మాజీ కెప్టెన్ మహ్మద్ యూసుఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. భారత్‌పై సాధించిన ఓ విజయం పాకిస్థాన్ క్రికెట్ పతనానికి కారణమైందని అన్నాడు. 2021 టీ20 ప్రపంచ కప్‌లో దుబాయ్ వేదికగా భారత్‌పై పాకిస్థాన్ 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఆ తర్వాత గొప్పలకు పోయి పొగరుగా వ్యవహరించారని.. ఆ జట్టు ప్రస్తుత సంక్షోభానికి ప్రధాన కారణాల్లో అదొకటని వివరించాడు.'2021 టీ20 ప్రపంచ కప్‌లో పాక్ బ్యాటర్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్ అద్భుతంగా రాణించారు. భారత్ నిర్దేశించిన 152 పరుగుల లక్ష్యాన్ని పాకిస్థాన్ ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా ఛేదించింది. ఆ విజయం తర్వాత కొంతమంది ప్లేయర్లు తాము ఏదో గొప్ప ఘనత సాధించామని భావించారు. అదే తీరును కొనసాగించారు. ఆ మ్యాచ్ తర్వాత మళ్లీ అదే స్థాయిలో ఆడలేకపోయారు. మీరు బాగా ఆడుతున్నప్పుడు కూడా వినయంగా ఉండటం నేర్చుకోవాలి. కాలర్ ఎగరేసుకుని, ఇతరులను అగౌరవపరిస్తే సమస్యలు వస్తాయి. పాకిస్థాన్ క్రికెట్‌లో ఇప్పుడు అలాంటే సమస్యలే చాలా వచ్చాయి' అని యూసుఫ్ వెల్లడించాడు.జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో కెప్టెన్సీ అంశం కూడా విభేదాలకు దారితీసిందని యూసుఫ్ వెల్లడించాడు. ప్రతి ఒక్కరూ పాకిస్థాన్ జట్టుకు కెప్టెన్ కావాలని ప్రయత్నించారని, దాని ప్రభావం ఇప్పటికీ జట్టుపై ఉందని చెప్పాడు. 'జట్టులో ప్రతి ఒక్కరూ జట్టుకు కెప్టెన్ కావాలని చూస్తున్నారు. దాని పరిణామాలు ఇప్పటికీ పాకిస్థాన్ క్రికెట్‌ను వెంటాడుతున్నాయి. ఇటీవల పాక్ చాలా దారుణమైన క్రికెట్ ఆడింది. పీసీబీ ఎప్పటికప్పుడు జట్టుకు మద్దతుగా నిలుస్తోంది. జట్టును మెరుగుపర్చేందుకు ఎంతో మంది కోచ్‌లు వచ్చారు.. వెళ్లారు. ఎన్నో మార్పులు చేశారు. అయినప్పటికీ ఒక్క ఆటగాడు కూడా ముందుకొచ్చి పూర్తి బాధ్యత తీసుకోలేదు' అని యూసుఫ్ అసంతృప్తి వ్యక్తం చేశాడు.



సినిమా

కృష్ణంభజే' మూవీ ఫస్ట్ లుక్ లాంచ్



హైదరాబాద్: జయశ్రీ మీడియా సమర్పణలో తెరకెక్కుతున్న భక్తిరస చిత్రం 'కృష్ణంభజే' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. కలాల్ శ్రీనివాస్ నిర్మాణంలో నాగరాజ్ కొట్టే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రముఖ సీనియర్ నటుడు బ్రహ్మాజీ మార్కండేయ పాత్రను పోషిస్తున్నారు. కృష్ణాష్టమి కానుకగా బ్రహ్మాజీ 'కృష్ణంభజే' ఫస్ట్ లుక్‌ను సోషల్ మీడియాలో లాంచ్ చేశారు.

పోస్టర్‌లో బ్రహ్మాజీ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. బ్రహ్మాజీ మార్కండేయుడి గెటప్‌లో సంప్రదాయ ఆధ్యాత్మిక రూపంలో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. కాషాయ వస్త్రధారణ, రుద్రాక్ష మాలలు, నుదుటిపై విభూతి, చేతిలో ఆయుధంతో ఆయన లుక్ ప్రత్యేకంగా నిలుస్తోంది. భక్తి, ఆధ్యాత్మికతకు ప్రతిబింబంగా కనిపిస్తున్న ఈ ఫస్ట్ లుక్ ప్రేక్షకుల్లో సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తోంది.

పౌరాణిక, భక్తిరస అంశాలను మేళవిస్తూ తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నాగరాజ్ కొట్టే రచనతో పాటు దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథకు అనుగుణంగా ప్రత్యేకమైన పాత్రలు, ఆసక్తికరమైన సన్నివేశాలతో సినిమాను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం తెలిపింది.

ఈ చిత్రంలో మురళీ గౌడ్, రచ్చ రవి, అభయ్ బెతిగంటి, గౌతమ్ రాజు, దయానంద్ రెడ్డి, యాదమ్మ రాజు తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. హీరోగా ప్రదీష్, హీరోయిన్‌గా వంగమయి పటేల్ నటిస్తున్నారు. చిత్రానికి సంబంధించిన సంభాషణలను రచ్చ రవి అందిస్తున్నారు.

ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా కొనసాగుతున్న నేపథ్యంలో 'కృష్ణంభజే'కు సంబంధించిన మరిన్ని వివరాలు, టీజర్, ఇతర ప్రచార చిత్రాలను త్వరలో విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది.

ఘనంగా "డెలులు" చిత్ర టీజర్ లాంచ్

క్రియేటివ్ లాంచ్ పాడ్ బ్యానర్ పై ప్రీతం కస్తూరి దర్శకత్వంలో సంకీర్త్ కొండ నిర్మాతగా ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం డెలులు. విజయ రాజ్ కుమార్, వేణి రావు, సాయి ప్రసన్న, అఖిల్ జాక్సన్, శ్రీరామ మండవ కీలక పాత్రలు పోషించారు. రేష్మిత్ ఎస్ కౌశిక రచించిన ఈ కథకు విజయ రాజ్ కుమార్ డైలాగులు అందించగా జై రాజ్ నాయుడు సినిమాటోగ్రఫీ చేశారు. ఆది చేబ్రోలు సంగీతాన్ని అందించిన ఈ చిత్రానికి హరికృష్ణ కూరపాటి ఎడిటర్ గా పనిచేశారు. నేటి జెన్ జి యువతకు దగ్గరగా ఉండే ఈ సినిమా జెన్ జి భాషలోనే డెలులు అని ఉపయోగించే ఒక పదంతో జెన్ జి ప్రేక్షకులను టార్గెట్ గా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్ర టీజర్ విడుదల కావడం జరిగింది.

ఈ సందర్భంగా సినిమాటోగ్రాఫర్ జై రాజ్ నాయుడు మాట్లాడుతూ... ''అందరికీ నమస్కారం. నాకు అవకాశం ఇచ్చి సపోర్ట్ గా నిలిచిన మా డైరెక్టర్ గారికి థాంక్స్. ఈ సినిమా మొదలై రెండు సంవత్సరాలు అయింది కాని నేను మా నిర్మాతను ఇప్పటి వరకు కలవలేదు. నన్ను కలవకుండానే నా ప్రతిభను నమ్మి, నాకు ఈ చిత్రానికి పని చేసేందుకు అవకాశం ఇచ్చారు. సినిమా ఎక్కడ బోర్ కొట్టకుండా చాలా బాగుంటుంది" అన్నారు.

ఎడిటర్ హరికృష్ణ మాట్లాడుతూ... ''కొత్తవారు అందరూ కలిసి ఈ సినిమా చేశాం. సినిమాలో చాలా ఫన్ ఉంటుంది. సినిమాను అందరూ ఆశిస్తారని కోరుకుంటున్నాను" అన్నారు.

సంగీత దర్శకుడు ఆది చేబ్రోలు మాట్లాడుతూ... "డెలులు అనే పదం జెన్ జి నుండి వచ్చింది. తొలి చిత్రంతో చాలా ప్రూవ్ చేసుకునేందుకు ప్రయత్నించాము. నిర్మాత సంకీర్త్ గారు మాకు చాలా సపోర్ట్ ఇచ్చి మమ్మల్ని ఎంకరేజ్ చేస్తూ ఒక అన్నలా చూసుకున్నారు. ఇలా ఒక స్టేజ్ పై మాట్లాడటం కొన్ని సంవత్సరాల కల. నేను ఈ సినిమా కోసం పని చేయడానికి ముఖ్య కారణం డిఓపి జై రాజ్ నాయుడు గారు. ఈ సినిమా కోసం పని చేసిన అందరికీ థాంక్స్" అన్నారు.

నటుడు అఖిల్ జాక్సన్ మాట్లాడుతూ... "మొదటిసారి ఇలా స్టేజ్ పై మాట్లాడుతున్నాను. నేను ఈ స్థాయిలో ఉన్నాను అంటే దానికి



కారణం మా అమ్మ. నాకు అవకాశం ఇచ్చిన సినీ బృందానికి థాంక్స్. సినిమా చాలా బావుండబోతుంది. ఇక్కడికి వచ్చిన వారికి అందరికీ థాంక్స్" అన్నారు.

హీరోయిన్స్ వేణి రావు, సాయి ప్రసన్న మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చి మాకు సపోర్ట్ చేసిన అందరికీ థాంక్స్. సినిమా కోసం చాలా కష్టపడ్డారు. మాకు అవకాశం అందించిన దర్శకనిర్మాతలకు థాంక్స్. సినిమా చాలా బావుంటుంది. అందరూ మమ్మల్ని ఆదరించవలసిందిగా కోరుకుంటున్నాము" అన్నారు.

చిత్ర దర్శకుడు ప్రీతం మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి హాజరైన మీడియా మిత్రులకు, ముఖ్య అతిథులకు ధన్యవాదాలు. సినిమా అనేది ఒక్కరి కృషితో సాధ్యం కాదు, మొత్తం టీమ్ సమష్టి కృషి వల్లే సినిమా పూర్తవుతుంది. ప్రొడక్షన్ కంట్రోలర్ చందు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ రిత్విక్, డైరెక్షన్ టీమ్ క్రాంతి, నారాయణ, డీవోపీ జయరాజ్, మ్యూజిక్ డైరెక్టర్ ఆది చేబ్రోలు, ఎడిటర్ హరికృష్ణలకు ప్రత్యేక కృతజ్ఞతలు. సినిమాలో సంగీతం, డైలాగ్స్ ప్రత్యేక ఆకర్షణగా ఉంటాయి, టీజర్‌లో విన్న మ్యూజిక్ కంటే సినిమాలో మరింత అద్భుతమైన సంగీతం ఉంటుంది. విజయ్ రాజ్‌కుమార్ రాసిన కథ ఆధారంగా విజన్‌తో డైలాగ్స్‌ను రూపొందించడం జరిగింది. హీరోయిన్లు ప్రసన్న, వేణి, మదర్ రోల్ చేసిన రమ, బాలనటిగా నటించిన అనికకు కూడా ధన్యవాదాలు. ఈ సినిమాతో డెబ్యూ డైరెక్టర్‌గా పరిచయం అవుతున్నాను, నా పై నమ్మకం ఉంచి అవకాశం ఇచ్చిన నిర్మాత సంకీర్త్ గారికి, హీరో విజయ్ రాజ్‌కుమార్ గారికి జీవితాంతం కృతజ్ఞుడిగా ఉంటాను" అన్నారు.

జిగిరీస్ చిత్ర నటుడు కృష్ణ మాట్లాడుతూ... "ఈ సినిమాను సపోర్ట్ చేస్తూ ఇక్కడికి వచ్చిన అందరికీ థాంక్స్. ఈ సినిమా టీజర్ చూసిన చాలా మజా అనిపించింది. ప్రమోషన్స్ బాగా చేస్తున్నారు. చిత్ర బృందం అందరికీ ఆల్ ది బెస్ట్" అన్నారు.

సీక్రెట్ సోల్జర్ చిత్ర దర్శకుడు అక్కి విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ... "నన్ను ఆహ్వానించిన చిత్ర బృందంకి థాంక్స్. ఈ సినిమా టీజర్ చూస్తే మంచి విజయం సాధిస్తుంది అనిపిస్తుంది. సినిమా బృందం అందరికీ ఆల్ ది బెస్ట్" అన్నారు.

నటుడు విజయ్ రాజ్ కుమార్ మాట్లాడుతూ... "ఈ కార్యక్రమానికి వచ్చిన మీడియా మిత్రులందరికీ ధన్యవాదాలు. డెలులు సినిమా వెనుక సంకీర్త్ కొండ కీలక పాత్ర పోషించారు. నేను కేవలం 10 నిమిషాల ఫోన్ కాల్‌లో కథ చెప్పగానే సంకీర్త్ సినిమా నిర్మించడానికి ముందుకొచ్చారు. టీజర్‌లో కూడా 'బిలీవ్డ్ బై సంకీర్త్ కొండ' అని ప్రత్యేకంగా పేర్కొన్నాము. ఇప్పటివరకు ఎవరూ సాహసించని కథను 'డెలులు' ద్వారా చెప్పబోతున్నాము, ప్రేక్షకులు సినిమాలో కొత్త అనుభూతిని పొందుతారు. సినిమాను భారీగా ప్రమోట్ చేయాలనే ఉద్దేశంతో టైటిల్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ముందుగానే నాలుగైదు కార్యక్రమాలు నిర్వహించాము. సినిమా డబ్ కట్ చూసిన తర్వాత నిర్మాత మార్కెటింగ్ బడ్జెట్‌ను పెంచి, సినిమాను మరింత గ్రాండ్‌గా ప్రేక్షకుల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారు. డీవోపీ జైరాజ్ నాయుడు, మ్యూజిక్ డైరెక్టర్ ఆది, ఎడిటర్ హరికృష్ణ, హీరోయిన్ శ్రీదేవి, హీరోయిన్లు, నటుడు అఖిల్ తదితరులు కృషి చేశారు. ముఖ్యంగా ఎడిటర్ హరికృష్ణ టీజర్‌ను అద్భుతంగా కట్ చేశారు. డెబ్యూ డైరెక్టర్ ప్రీతమ్ చాలా బాగా సినిమాను తెరకెక్కించారు, తన మొదటి సినిమాతోనే మంచి ప్రతిభ చూపించారు. నటుడు అభినయ్‌కు సినిమాలో మంచి పాత్ర ఉంటుంది. సినిమాలో పనిచేసిన వారంతా కొత్తవాళ్లే. ఈవెంట్‌ను విజయవంతంగా నిర్వహించిన పీఆర్ఓ మధు, అజయ్, స్టార్ సర్కిల్ టీమ్‌కు ధన్యవాదాలు. రైటర్ రేష్మిత్ కలిసి కథను వేగంగా పూర్తి చేయడంలో ఎంతో సహకరించారు. నా తొలి సినిమా సమయంలో మెగాస్టార్ చిరంజీవి తనను అభినందిస్తూ మెసేజ్ పంపడం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. ఒకసారి చిరంజీవి పెట్టిన వాట్సాప్ స్టేటస్ చూసి, "చిరంజీవి గారు నన్ను హీరోగా నమ్ముతున్నప్పుడు నేను కూడా నన్ను నమ్మాలి" అని భావించాను. ఆ ఆలోచనతోనే మళ్లీ కొత్తగా ప్రారంభించాను, ఇప్పుడు 'డెలులు' ప్రేక్షకుల ముందుకు వస్తుంది. చిరంజీవి గారి వాట్సాప్ స్టేటస్ నా జీవితాన్ని మార్చేసింది" అంటూ ముగించారు.

నటీనటులు :

విజయ రాజ్ కుమార్, వేణి రావు, సాయి ప్రసన్న, అఖిల్ జాక్సన్, శ్రీరామ మండవ

'ఎపిక్' చిత్రం గొప్ప విజయం సాధించాలి – రష్మిక మందన్నా



ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా డెబ్యూ డైరెక్టర్ ఆదిత్య హాసన్ దర్శకత్వం వహిస్తున్న 'ఎపిక్ ? ఫస్ట్ సెమిస్టర్' చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించారు. ఈ సినిమాని సెప్టెంబర్ 11న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో శుక్రవారం నాడు ట్రైలర్‌ను విడుదల చేశారు.

'నా పేరు ఆనంద్.. సారీ సారీ.. ఆదిత్య.. నాకు డైరెక్టర్ అవ్వాలని ఉంది.. సినిమాలో ఓ మ్యాజిక్ ఉంది.. ఓ మంచి సినిమా, మన సినిమా తీయాలని ఉంది' అంటూ సాగే ఈ ట్రైలర్ ఆద్యంతం ఆకట్టుకునేలా ఉంది. ఆ తర్వాత విదేశాలకు హీరో వెళ్లడం, అక్కడ జరిగే సన్నివేశాలు యూత్‌ని కట్టి పడేసేలా ఉన్నాయి. హీరో, హీరోయిన్ల సన్నివేశాలు, లవ్ ట్రాక్ ఇవన్నీ కూడా రీఫ్రెషింగ్‌గా కనిపిస్తున్నాయి. ఇక ఈ ట్రైలర్‌లో కళ్యాణ్ శంకర్ కనిపించిన సీన్, ఆయన చెప్పిన డైలాగ్ యూత్‌కి బాగా కనెక్ట్ అయ్యేలా ఉంది.

'లోన్ ఈఎంఐ కట్టడానికి డబ్బులు ఎందుకు పంపడం లేదు రా' అని తల్లి అడగడం.. 'కన్నప్పుడు కాలేజ్ ఫీజ్ కూడా కట్టకుంటే ఇంకెందుకు మమ్మీ' అని హీరో అనే డైలాగ్‌తో ఒక్కసారిగా ఎమోషనల్ టర్న్ తీసుకుంటుంది. 'బ్రేకప్ అవ్వాలంటే.. ఇలా తిట్టుకుంటూ, ఎవరో ఒకర్ని బ్లేమ్ చేసుకుంటూ బ్రేకప్ అవ్వాలా' అని హీరో చెప్పే డైలాగ్, ఆ తర్వాత హీరోయిన్ చెప్పే మాటలు అన్నీ కూడా ఓ ఫీల్ గుడ్ ఎమోషనల్ లవ్ స్టోరీని చూడబోతోన్నామనే హింట్‌ను ఇచ్చేలా ఉన్నాయి. ఒక రిలేషన్‌షిప్ ఎప్పుడు ఎపిక్ అవుతుందో తెలుసా?.. అని హీరో అనడం.. ట్రైలర్‌లోని చివరి డైలాగ్స్ అన్నీ కూడా యూత్‌ని మెప్పించేలా ఉన్నాయి.

ఈ సందర్భంగా నిర్వహించిన ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి నేషనల్ క్రష్ రష్మిక మందన్నా, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ శివ నిర్వాణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ కార్యక్రమంలో..

×రష్మిక మందన్నా మాట్లాడుతూ× .. "ఎపిక్' ట్రైలర్ నాకు నచ్చింది. ఆనంద్ ఎప్పుడూ సినిమా గురించే ఆలోచిస్తుంటాడు. సినిమా కోసమే కష్టపడుతుంటాడు. కడలి పాత్ర గొప్పగా ఉంటుందని చెప్పారు. ఈ చిత్రంతో వైష్ణవికి గొప్ప పేరు వస్తుంది. ఆదిత్యను చూస్తే గర్వంగా అనిపిస్తుంటుంది. '90స్' తర్వాత ఆయనపై బాధ్యత పెరిగిపోయింది. హేషమ్ గారి మ్యూజిక్ ఎప్పుడూ గొప్పగానే ఉంటుంది. శివాజీ గారిని ఇక్కడ చూడటం, కలవడం ఆనందంగా ఉంది. సెప్టెంబర్ 11న 'ఎపిక్' రాబోతోంది. సెప్టెంబర్ 10న ప్రీమియర్లు వేస్తున్నారు. టీంతో కలిసి నేను సినిమాని చూస్తాను. 'ఎపిక్' చిత్రం గొప్ప విజయం సాధించాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.

×ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ× .. "ఎపిక్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి వచ్చిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మా కోసం వచ్చిన మా వదినమ్మ రష్మికకు థాంక్స్. ఎప్పుడూ సపోర్ట్‌గా నిలిచే వదినమ్మ దొరకడం నా అదృష్టం. 'ఎపిక్' అనే టైటిల్ పెట్టడానికి కారణం ఉంది. మన జీవితంలో ఎన్నో ఎపిక్ మూమెంట్స్ ఉంటాయి. మనం బాధల్లో ఉంటే భాగస్వామి వచ్చి పట్టుకున్నా, నుదుటి మీద ముద్దు పెట్టుకున్నా ఎపిక్ మూమెంట్ అవుతుంది. ట్రైలర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. కొత్త దర్శకులు ఇండస్ట్రీలోకి కొత్త ఐడియాలు తీసుకువస్తారు. ఆదిత్య అందరి జీవితాల్ని నిశితంగా పరిశీలిస్తుంటాడు. ఈ సినిమా అందరికీ ఓ థెరపీలా ఉంటుంది. ఇదొక ఎమోషనల్ సినిమా. మనల్ని మనం తెరపై చూసుకున్నట్టుగా అనిపిస్తుంది. ఇదొక అందమైన చిత్రం. అందరినీ సర్ ప్రైజ్ చేస్తుంది. అందరినీ ఆకట్టుకుంటుంది. 'ఏమాయ చేశావే', 'ప్రేమలు' కలిపితే వచ్చే ఓ అందమైన కథలా 'ఎపిక్' ఉంటుంది. మాకు హేషమ్ మంచి మ్యూజిక్ ఇచ్చారు. కడలి పాత్రలో వైష్ణవి అద్భుతంగా నటించింది. ఆమె తన పర్ఫామెన్స్‌తో అందరినీ సర్ ప్రైజ్ చేస్తుంది. వైష్ణవి ఇంకా ఎంతో గొప్ప స్థాయికి వెళ్లాలి. సెప్టెంబర్ 11న మా చిత్రం రానుంది. మా సినిమా అందరినీ కదిలిస్తుంది' అని అన్నారు.

×వైష్ణవి చైతన్య మాట్లాడుతూ× .. 'మా 'ఎపిక్' కోసం వచ్చిన రష్మిక గారికి, శివ నిర్వాణ గారికి థాంక్స్. సితార బ్యానర్‌లో నేను సినిమాలు చేస్తూనే వస్తున్నాను. ఇప్పుడు ఈ బ్యానర్‌లో 'ఎపిక్'ని చేయడం ఆనందంగా ఉంది. ముమ్ముందు మరిన్ని మంచి చిత్రాల్ని చేయాలని కోరుకుంటున్నాను. ఆదిత్య గారు నా ఫేవరేట్ డైరెక్టర్, ఫ్రెండ్. కడలి పాత్రలో నన్ను చూసి, నాకు అవకాశాన్ని ఇచ్చినందుకు ఆదిత్య గారికి థాంక్స్. అజీమ్ గారు మా అందరినీ అద్భుతంగా చూపించారు. ప్రతీ ఫ్రేమ్‌ని అందంగా మలిచారు. హేషమ్ గారు మాకు మంచి మ్యూజిక్ ఇచ్చారు. 'బేబి' నుంచి ఆనంద్‌తో పరిచయం ఏర్పడింది. అప్పుడూ, ఇప్పుడూ ఆనంద్ ఒకేలా ఉన్నాడు. ఆనంద్‌లో ఎప్పుడూ ఒకేలా ఉండటం అనే ఆ లక్షణమే నాకు ఇష్టం. పక్కన వారు ఎదుగుతుంటే ఆనంద్ ఎక్కువగా సంతోషిస్తాడు. నాకు కళ్యాణ్ శంకర్ గారు ఈ సినిమాతో మంచి ఆర్టిస్ట్‌గా బిజీ అవుతారు. 'ఎపిక్' చిత్రం మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు.

×శివాజీ మాట్లాడుతూ× .. "'ఎపిక్'లో మంచి పాత్రను ఇచ్చిన ఆదిత్యకి, నాగవంశీ గారికి థాంక్స్. ఇదంతా కూడా ఆదిత్య క్రియేట్ చేసిన ప్రపంచం. '90స్' అనేది నా కెరీర్‌లో ఓ మిరాకిల్. ఆదిత్య గొప్పగా కథను నెరేట్ చేస్తాడు. ఈ కథలన్నీ కూడా ఆదిత్య జీవితంలోంచి వచ్చినవే (నవ్వుతూ). ప్రేక్షకులకి గుర్తుండిపోయే పాత్రలు, సినిమాల్ని చేయాలని ఫిక్స్ అయ్యాను. నా పాత్రకు ప్రాధాన్యంతో పాటు కథ బాగుందా? లేదా? అన్నది చూస్తున్నాను. ట్రైలర్‌లో చూపించినట్టుగా కాకుండా.. సినిమాలో గొప్ప ఎమోషన్ ఉంటుంది. ఇది జెన్ జీ సినిమా మాత్రమే కాదు. ప్రతీ తరం ఈ మూవీని గుండెల్లో పెట్టుకుంటుంది. విదేశాల్లో చదువుకునే కుర్రాళ్లు, ఆ కుర్రాళ్లకు సంబంధదించిన కుటుంబాలకు మరింత ఎక్కువగా కనెక్ట్ అవుతుంది. రొమాన్స్, బ్రేకప్స్ అనేవి ఈ కథలో భాగంగా వస్తాయి. ఆడియెన్స్‌ని థియేటర్లకు రప్పించాలనే ఉద్దేశంతో మాత్రం సీన్లను రాసుకోలేదు. క్లైమాక్స్ చాలా ఎమోషనల్‌గా ఉంటుంది. సెప్టెంబర్ 11న అందరూ థియేటర్లకు రండి. చాప్టర్ 2 నెక్ట్స్ లెవెల్‌లో ఉంటుంది' అని అన్నారు.

×ఆదిత్య హాసన్ మాట్లాడుతూ× .. "ఎపిక్' ట్రైలర్ చూసి అందరికీ కల్చరల్ షాక్ కలిగే ఉంటుంది. 90స్ వరల్డ్ నుంచి వస్తున్నా కూడా కొంత షాకింగ్‌గా ఉంటుంది. ఇది కేవలం అట్రాక్షన్ కోసం చేసింది కాదు. ఇందులో మంచి ఎమోషనల్ దెప్త్ ఉంటుంది. ఆ విషయం సినిమా చూసిన తర్వాత అందరికీ అర్థం అవుతుంది. అందరికీ 'ఎపిక్' సినిమా నచ్చుతుంది. ఈ మూవీలో అమాయకత్వం ఉంటుంది. ఆనంద్, వైష్ణవి, శివాజీ గారు, వాసుకి గారు అద్భుతంగా నటించారు. హేషమ్ పాటలు, ఆర్ఆర్ అందరినీ ఆకట్టుకుంటుంది. అజీమ్ విజువల్స్ గొప్పగా ఉంటాయి. 'ఎపిక్' కోసం పని చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. ఈ సినిమా అందరికీ గుర్తుండిపోతుంది' అని అన్నారు.

×శివ నిర్వాణ మాట్లాడుతూ× .. 'యంగ్ డైరెక్టర్స్ అందరినీ ఇలా చూస్తుండటం ఆనందంగా ఉంది. ఆదిత్య రైటింగ్ బాగుంటుంది. ఆనంద్, వైష్ణవి కలిసి చేసిన 'బేబి' గొప్ప విజయాన్ని సాధించింది. మళ్లీ ఈ ఇద్దరి కాంబోలో ఆదిత్య చేస్తుండటం, ఆ సినిమాతో ఎక్కడా పోలికలు రాలేకపోవడం గొప్ప విషయం. ఆ విషయంలో మాత్రం ఆదిత్య సక్సెస్ అయ్యాడని చెప్పుకోవచ్చు. విజువల్స్ అద్భుతంగా అనిపించాయి. జెన్ జీ ఆడియెన్స్‌కి ఈ సినిమా కనెక్ట్ అవుతుంది. హేషమ్ తన మ్యూజిక్‌తో మ్యాజిక్ చేశారు. ఆనంద్ నన్ను ఎప్పుడూ సొంత అన్నలా చూసుకుంటాడు. ఆనంద్ తన సినిమాలు, యాక్టింగ్‌తో గ్రౌండ్ లెవెల్‌కి వెళ్లాడు. వైష్ణవి గ్రోత్ చూస్తుంటే హ్యాపీగా అనిపిస్తుంది. 'కోర్ట్', 'దండోరా' అంటూ శివాజీ గారు ప్రతీ సినిమాతో అదరగొడుతున్నారు. థియేటర్లన్నీ వైబ్‌తో ఊగిపోవాలి. 'ఎపిక్' మంచి విజయం సాధించాలి' అని అన్నారు.

×శైలేష్ కొలను మాట్లాడుతూ× .. 'ఆదిత్య పేరు చూసి ఫస్ట్ డే ఫస్ట్ షోకి వెళ్లొచ్చు. '90స్' నాకు ఎంతో ఇష్టం. అదే ప్రపంచంలోంచి మళ్లీ 'ఎపిక్' రాబోతోంది. ఆదిత్య రైటింగ్ అద్భుతంగా ఉంటుంది. ఆనంద్, వైష్ణవి 'బేబి'తో అద్భుతం చేశారు. మళ్లీ ఈ జంటకి గొప్ప విజయం దక్కాలి. విజువల్స్ బాగున్నాయి. హేషమ్ గారి మ్యూజిక్ అద్భుతంగా ఉంది. సెప్టెంబర్ 11న 'ఎపిక్' మూవీని అందరూ చూడండి' అని అన్నారు.

×కళ్యాణ్ శంకర్ మాట్లాడుతూ× .. "ఎపిక్' విషయంలో ముందుగా ఆదిత్యకే థాంక్స్ చెప్పాలి. 'ఎపిక్' కథ చెప్పిన వెంటనే నాకు నచ్చింది. ఆనంద్, వైష్ణవి చేసిన ఈ చిత్రం 'బేబీ' కంటే పెద్ద హిట్ అవుతుంది. శివన్నతో నటించడం గొప్పగా అనిపించింది. సినిమా అద్భుతంగా ఉంటుంది. ఆదిత్య చివరి వరకు సినిమా కోసం కష్టపడుతూనే ఉంటాడు' అని అన్నారు.

×వినోద్ అనంతోజు మాట్లాడుతూ× .. "ఎపిక్' మూవీని ఆల్రెడీ చూశాను. ఆదిత్య అద్భుతంగా రాశాడు, తీశాడు. ఆద్యంతం వినోద భరితంగా సాగుతూనే ఎమోషనల్‌గానూ టచ్ చేస్తుంది. వైష్ణవి పాత్ర గొప్పగా ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఇలాంటి ఓ సినిమా వచ్చి చాలా రోజులు అవుతోంది. ఆనంద్‌తో చేసిన 'మిడిల్ క్లాస్ మెలోడీస్' కరోనా వల్ల ఓటీటీలోకి వచ్చింది.

×ప్రముఖ దర్శకుడు సాయి మార్తాండ్ మాట్లాడుతూ× .. "ఎపిక్'లో వైష్ణవి, ఆనంద్ నటన అద్భుతంగా ఉంటుంది. క్లైమాక్స్‌లో శివాజీ గారు అదరగొట్టేశారు. ఆదిత్య నిర్మించిన 'లిటిల్ హార్ట్స్' వచ్చి ఏడాది అవుతోంది. 'లిటిల్ హార్ట్స్' కంటే 'ఎపిక్' పెద్ద విజయం సాధించాలి' అని అన్నారు.

×మ్యూజిక్ డైరెక్టర్ హేషమ్ అబ్దుల్ వాహబ్ మాట్లాడుతూ× .. "తెలుగులో నాకు మంచి అవకాశాల్ని ఇస్తున్న అందరికీ థాంక్స్. 'ఎపిక్' మూవీలో ఛాన్స్ ఇచ్చిన ఆదిత్యకు థాంక్స్. సినిమా అద్భుతంగా వచ్చింది. 'ఎపిక్' టీంతో కలిసి పని చేయడం ఆనందంగా ఉంది. ఆనంద్, వైష్ణవి అద్భుతంగా నటించారు. 'ఎపిక్' సినిమా టైటిల్‌కు తగ్గట్టుగా ఎపిక్ విజయాన్ని సాధించాలి' అని అన్నారు.

×శ్రీనివాస్ గవిరెడ్డి మాట్లాడుతూ× .. "ఎపిక్' టీజర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ట్రైలర్ అదిరిపోతుంది. ఇండస్ట్రీలో గుర్తుండిపోయే లవ్ స్టోరీస్‌లో 'ఎపిక్' కూడా ఉంటుంది. కడలి, ఆదిత్య అందరికీ గుర్తుండిపోతారు' అని అన్నారు.

నటీనటులు: ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య, శివాజీ, వాసుకి, రోహన్ తదితరులు నటిస్తున్నారు

Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844